
**విలేకరులు కావలెను**
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

E69 NEWS
# తెలుగు గళం
సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

PUBLISHED: TELANGANA | సంపుటి :01 | సంచిక :155 | గురువారం 14 మే 2026 | ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ | పేజీలు: 08 | వెల :05/-

# తమిళ నాట 'విజయ్' దుందుభి

- అసెంబ్లీలో నెగ్గిన ముఖ్యమంత్రి విజయ్ విశ్వాస తీర్మానం
- సభ నుంచి వాకౌట్ చేసిన ప్రతిపక్ష డీఎంకే
- నిలువునా చీలిపోయిన అన్నా డీఎంకే వర్గాలు.
- ముఖ్యమంత్రిపై ఘాటు వ్యాఖ్యలు చేసిన ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్
- తమిళనాట మారిన రాజకీయ సమీకరణాలు, విజయ్ పట్టు బిగింపు



తమిళనాడు రాజకీయాల్లో పెను సంచలనం నమోదైంది. గత కొద్ది రోజులుగా సాగుతున్న ఉత్కంఠకు తెరదించుతూ, ముఖ్యమంత్రి విజయ్ అసెంబ్లీలో జరిగిన బలపరీక్షలో ఘనవిజయం సాధించారు. మెజారిటీ సభ్యుల మద్దతును కూడగట్టుకోవడంలో ఆయన సఫలీకృతులయ్యారు. సభ ప్రారంభమైనప్పటి నుంచే ఉద్రిక్త వాతావరణం నెలకొన్నప్పటికీ, అంతిమంగా విజయం విజయ్ వైపే నిలిచింది.

సభలో విశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టిన అనంతరం ముఖ్యమంత్రి విజయ్ మాట్లాడుతూ, తమ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తుందని, ఎలాంటి కుతంత్రాలకు లొంగబోమని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఆయన మండిపడ్డారు. ఈ గెలుపు ప్రజల నమ్మకానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

చీలిపోయిన అన్నా డీఎంకే

మరోవైపు, ప్రధాన ప్రతిపక్షాల్లో ఒకటైన అన్నా డీఎంకే పార్టీలో అంతర్గత విభేదాలు బహిర్గతమయ్యాయి. బలపరీక్ష సమయంలో ఆ పార్టీ రెండుగా చీలిపోయింది. ఒక వర్గం ముఖ్యమంత్రి విజయ్ ప్రవేశపెట్టిన తీర్మానానికి మద్దతు తెలపగా, మరో వర్గం వ్యతిరేకంగా ఓటు వేయడం విశేషం. ఈ పరిణామంతో అన్నా డీఎంకేలో సంక్షోభం ముదిరినట్లయింది.

పార్టీ విప్ జారీ చేసినప్పటికీ, సభ్యులు రెండు వర్గాలుగా విడిపోవడంతో రాజకీయ పండితులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ చీలిక భవిష్యత్తులో తమిళ రాజకీయాలను ఏ మలుపు తిప్పుతుందోనన్న ఉత్కంఠ మొదలైంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో విజయ్ తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నట్లు కనిపిస్తోంది.

విజయ్ పట్టు.. సుస్థిర పాలన దిశగా..!!

బలపరీక్షలో విజయం సాధించిన తర్వాత అసెంబ్లీ వెలుపల విజయ్ అభిమానులు, పార్టీ శ్రేణులు సంబరాల్లో మునిగిపోయారు. ఇది కేవలం పార్టీ విజయం మాత్రమే కాదని, తమిళనాడు భవిష్యత్తుకు శు భసూచకమని నేతలు కొనియాడారు. సభలో మెజారిటీ నిరూపించుకోవడంతో విజయ్ ప్రభుత్వం మరింత ధీమాగా ముందడుగు వేయనుంది.

అయితే, ప్రతిపక్షాల నుంచి ఎదురవుతున్న సవాళ్లను విజయ్ ఎలా ఎదుర్కొంటారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. డీఎంకే దూకుడు, అన్నా డీఎంకేలో చీలికలు వెరసి తమిళనాడు రాజకీయ రంగస్థలం ఇప్పుడు యుద్ధభూమిని తలపిస్తోంది. వచ్చే ఎన్నికల నాటికి ఈ సమీకరణాలు మరెన్ని మార్పులకు లోనవుతాయో వేచి చూడాలి.

మొత్తానికి, తమిళనాడు కోటపై విజయ్ తన జెండాను రెపరెపలాడించారు. బలపరీక్షలో నెగ్గడం ద్వారా తనకు తిరుగులేదని నిరూపించుకున్నారు. ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొడుతూ, తనదైన శైలిలో పాలనను కొనసాగించేందుకు ఆయన సిద్ధమవుతున్నారు. ఈ రాజకీయ మలుపులు తమిళ ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పులు తెస్తాయో చూడాలి.

# హైదరాబాద్‌లో ఉబెర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విస్తరణ

హైదరాబాద్



ప్రధాన నగరాల్లో పెరుగుతున్న పార్కింగ్ సమస్యపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఉబెర్ సంస్థకు సూచించారు. అవకాశం ఉంటే మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలని ఆయన కోరారు.

బుధవారం జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఉబెర్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దారా ఖోస్రోషాహి నేతృత్వంలోని ప్రతినిధి బృందం భేటీ అయింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలంగాణలో ఉబెర్ సంస్థ వ్యాపార కార్యకలాపాలను దారా ఖోస్రోషాహి వివరించారు. హైదరాబాద్‌లో ఉబెర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను విస్తరిస్తున్నట్లు ఆయన తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన తొలి సెంటర్ ఇదేనని, ఇక్కడ 600 మంది ఇంజినీర్లు పనిచేస్తున్నట్లు వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి ఆయన ముందుకు వచ్చారు. భవిష్యత్తులో మరింత విస్తరణకు ఆసక్తి చూపుతున్నట్లు దారా ఖోస్రోషాహి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ సహకారం ఉండాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు. 2 లో

# ప్రధాని పొదుపు విధానాల పై ఏపీ లో కార్యాచరణ ప్రణాళిక



2 లో

అమరావతి

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి వేదికగా మరో ప్రతిష్టాత్మక అడుగు పడింది. రాష్ట్ర యువతను ప్రపంచస్థాయి నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ' కి వైభవంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి కేవలం భవనాలతోనే కాదు, యువత నైపుణ్యంతోనే సాధ్యమని ఆకాంక్షించారు. అయితే, ఇదే వేదికపై నుంచి ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులపై స్పందిస్తూ ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.

# కనీస మద్దతు ధర పెంపునకు కేంద్ర కేబినెట్ ఆమోదం!

న్యూఢిల్లీ:



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన కేంద్ర మంత్రిమండలి రైతాంగానికి మేలు చేకూర్చేలా పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు వివరించారు. 2026-27 మార్కెటింగ్ సీజన్‌కు గాను 14 రకాల ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరను (MSP) పెంచుతూ కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నిర్ణయం వల్ల దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది రైతులకు ఆర్థికంగా గొప్ప వెసులుబాటు కలుగుతుందని మంత్రి పేర్కొన్నారు.

రైతులకు పెట్టుబడిపై కనీసం 50 శాతం లాభం ఉండాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఈ ధరలను సవరించినట్లు అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ప్రధానంగా సాధారణ రకం వరి మద్దతు ధరను క్వింటాల్‌కు రూ. 2,441గా, గ్రేడ్-ఎ రకం వరి ధరను రూ. 2,461గా నిర్ణయించారు. అత్యధికంగా పొద్దుతిరుగుడు గింజలపై క్వింటాల్‌కు రూ. 622, పత్తిపై రూ. 557 మేర ధరలను పెంచడం విశేషం. ఈ పెంపుదల వల్ల సుమారు రూ. 2.60 లక్షల కోట్ల మేర రైతులకు చెల్లింపులు జరుగుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

వ్యవసాయ రంగంతో పాటు ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించేందుకు మరో భారీ ప్రాజెక్టుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ. 37,500 కోట్ల వ్యయంతో 'సర్ఫేస్ కోల్ గ్యాసిఫికేషన్' (బొగ్గు గ్యాసిఫికేషన్) ప్రాజెక్టులను ప్రోత్సహించాలని నిర్ణయించారు. దీని ద్వారా బొగ్గును సింథసిస్ గ్యాస్‌గా మార్చి విద్యుత్, రసాయనాలు, ఎరువుల తయారీలో ఉపయోగిస్తారు. తద్వారా విదేశీ దిగుమతులపై ఆధారపడటం తగ్గుతుందని, సుమారు రూ. 2.5 లక్షల కోట్ల నుంచి 3 లక్షల కోట్ల మేర పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని మంత్రి వివరించారు.

# ఇంటర్ బోర్డు విలీనం గందరగోళం

## విద్యాశాఖలో కీలక అధికారి తీరు వివాదం

విద్యాశాఖలో ఓ కీలక అధికారి తీరుపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సదరు అధికారి అలసత్వం వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని ఫిర్యాదులు వస్తున్నాయి. ముఖ్యమైన అంశాల విషయంలో చాలా తేలికగా నిర్ణయాలు తీసుకోవడం వల్ల పరువు పోయే పరిస్థితులు వస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. తాజాగా ఇంటర్ బోర్డు విలీనం విషయంలో ఆ ఆఫీసర్ నిర్లక్ష్యం వల్లే గందరగోళ పరిస్థితులు ఏర్పడినట్లు తెలుస్తోంది. చివరికు సీఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని ఆ సమస్యను పరిష్కరించారని గుసగుసలు వినిపించాయి.




2 లో

# పాకిస్తాన్‌లో చమురు సంక్షోభం.. రాత్రి 9 తర్వాత గ్యాస్ సరఫరా బంద్

పాకిస్తాన్‌లో చమురు సంక్షోభం తీవ్ర స్థాయికి చేరింది. దేశంలో అవసరాలకు సరిపడా చమురు లభించడం లేదు. దీంతో గ్యాస్ వినియోగంపై కఠిన నిర్ణయాల్ని అమలు చేస్తోంది పాక్ ప్రభుత్వం. పాకిస్తాన్‌లోని ప్రధాన నగరమైన కరాచీలో రాత్రి తొమ్మిది తర్వాత గ్యాస్ సరఫరాను ప్రభుత్వం నిలిపివేసింది.

అక్కడ ప్రభుత్వమే ఇండ్లకు ఎల్ఎన్జీని సరఫరా చేస్తోంది. గతంలో నిరంతరం గ్యాస్ సరఫరా జరిగేది. కానీ, ప్రస్తుతం రోజూ పరిమితంగా మాత్రమే గ్యాస్ సరఫరా అవుతోంది. రోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం కొద్దిసేపు మాత్రమే గ్యాస్ అందిస్తోంది. దీంతో చాలా మంది గ్యాస్ సరఫరా కోసం ఎదురుచూస్తున్నారు. గ్యాస్ సరఫరా జరిగినప్పుడే వంటలు చేసుకుంటున్నారు. ఇక, రాత్రి 9 తర్వాత గ్యాస్ సరఫరాను ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో రాత్రి 9 తర్వాత వంట చేసుకునేందుకు అవకాశం లేదు. ఈ లోపే వంట చేసుకుని తినాల్సి వస్తోంది. గ్యాస్ అందుబాటులో ఉన్న సమయంలోనే వంట పూర్తి చేసుకునేందుకు అక్కడి మహిళలు తంటాలు పడుతున్నారు.

2 లో

# చంద్రబాబు ప్రభుత్వంపై అంబటి రాంబాబు ధ్వజం

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్రస్థాయిలో ఆరోపించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి అన్నదాతలను ప్రభుత్వం నిట్టనిలువునా ముంచుతోందని మండిపడ్డారు.



2 లో

# నీటి ప్రాజెక్టులపై

## కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు

నీటి ప్రాజెక్టుల అంశాన్ని అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసి వాటిని పూర్తి చేయాల్సిన అవసరం ఉందని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఆంధ్రప్రదేశ్ గోదావరి, కృష్ణా నదులపై ఒక్కో ప్రాజెక్టులకు మూడు విధానాలు అమలు చేస్తున్నారని అందులో ఒకటి విఫలమైతే మరొకటి ఆచరణలోకి తీసుకువస్తున్నారని గుర్తు చేశారు. ఏపీ చేస్తున్న ప్రత్యామ్నాయాలు సరే మనం ఎందుకు ఆ రకంగా చేయలేకపోతున్నామని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నీటి పారుదల ప్రాజెక్టుల కోసం లక్ష 80 వేల కోట్లు ఖర్చు చేశారు.



2 లో

# ఇంటర్ బోర్డు విలీనం గందరగోళం..
# విద్యాశాఖలో కీలక అధికారి తీరు వివాదం

మొదటి పేజీ తరువాయి

చివరివరకూ నాన్చుడు ధోరణి

జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా రాష్ట్రంలో విద్యాబోధన జరగాలంటూ సీఎం రేవంత్ బలంగా విశ్వసిస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా సందర్భం వచ్చిన ప్రతిసారీ ఎస్ఎస్‌సీ, ఇంటర్ బోర్డులను ఒకే గొడుగు కిందకు తీసుకొస్తే ఎలా ఉంటుందో పరిశీలన చేయాలంటూ అధికారులను అలర్ట్ చేస్తున్నారు. ఆ సమయానికి సరేనంటూ తలూపిన విద్యాశాఖ అధికారులు ఆ విషయాన్ని పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. ఈ ఏడాది విద్యా కమిషన్ తన తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పించే సమయంలో సైతం 2 బోర్డులను విలీనం చేసే అంశం ఏమైందంటూ సీఎం గుర్తు చేసినట్లు తెలిసింది.

అదే పనిలో ఉన్నామంటూ ఆ క్షణానికి చెప్పిన అధికారులు ఆ తర్వాత మాత్రం ఆ విషయాన్ని పక్కన పెట్టేశారని ఆరోపణలు ఉన్నాయి. సీఎం ఆదేశాల మేరకు అధికారులు బోర్డుల విలీనానికి కావాల్సిన ప్రక్రియ ప్రారంభించారేమోనని ఉద్దేశంతో 2026-27 అకడమిక్ ఇయర్ కోసం జారీ చేసిన అడ్మిషన్ షెడ్యూల్‌ను వాయిదా వేశారు. అసలు అలాంటి ప్రక్రియ ఏం జరగలేదని తెలుసుకుని ఈ ఏడాది యథావిధిగా ఇంటర్ అడ్మిషన్లను షెడ్యూల్‌ను ప్రారంభించారు.

ఫ్రీడమ్ ఇస్తే ఇరకాటంలోకి నెట్టిన అధికారి..

విద్యాశాఖలో కీలక హోదాలో పనిచేస్తోన్న ఓ ఆఫీసర్‌కు సీఎం రేవంత్ పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. సదరు అధికారి తీసుకున్న నిర్ణయాలు పక్కాగా ఉంటాయనే ధీమాతో తన సంతకం కోసం వచ్చే ప్రతి ఫైల్‌ను చూడకుండానే క్లియర్ చేస్తారని టాక్ ఉన్నది. సదరు అధికారి మాత్రం సీఎం ఇచ్చిన ఫ్రీడమ్‌ను దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలున్నాయి. బోర్డుల విలీనం విషయంలో ఆ ఆఫీసర్ కాలయాపన చేయడం తప్పా, విలీనానికి ముందు తలెత్తే సాంకేతిక, న్యాయపరమైన అంశాలపై సీఎంకు వివరించే ప్రయత్నం చేయలేదని ఫిర్యాదులు ఉన్నాయి. 'బోర్డుల విలీనం విషయంలో ఆ ఆఫీసర్ కీలకం. కాని ఏనాడూ అందుకు కావాల్సిన కసరత్తు చేయలేదు. సీఎం చెప్పినప్పుడు సరేనంటూ సమాధానం ఇచ్చిన అధికారి ప్రస్తుతం అకడమిక్ ఇయర్ (2026--27)లో సాధ్యం కాదనే విషయం చివరి వరకు చెప్పకుండా నిర్లక్ష్యం వహించారు. దీనితో ప్రభుత్వం పరువుపోయే పరిస్థితి ఏర్పడింది' అని ప్రభుత్వంలోని ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి వివరించారు.

వారం పాటు గందరగోళం

ముందుగా ప్రకటించిన ఇంటర్ అడ్మిషన్ల షెడ్యూల్‌ను తాత్కాలికంగా వాయిదా వేశారు. దీంతో ఎస్ఎస్‌సీ, ఇంటర్ బోర్డులను విలీనం చేస్తారని ప్రచారం జరిగింది. ఇంత తొందరగా విలీనం ఎలా చేస్తారని ప్రశ్నలు వ్యక్తం అయ్యాయి. పూర్తిస్థాయి కసరత్తు చేసిన తరువాతనే షెడ్యూల్‌ను వాయిదా వేశారేమోనని అందరూ అనుకున్నారు. కానీ రోజులు గడుస్తున్నా సదరు అధికారి నుంచి ఎలాంటి రెస్పాండ్ లేకపోవడంతో సీఎం రేవంత్ నేరుగా జోక్యం చేసుకుని రివ్యూ నిర్వహించారు. ఇప్పటికప్పుడు విలీనం సాధ్యం కాదని సదరు ఆఫీసర్ నుంచి వచ్చిన సమాధానంపై సీఎం సీరియస్ గా 'ఇంతకాలం ఏం చేశారు? ఇదే విషయాన్ని గతంలో ఎందుకు చెప్పలేదు? షెడ్యూల్ వాయిదా వేశాక ఇప్పుడు చెప్తారా?' అని నిలదీసినట్లు తెలిసింది. అనంతరం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఇంటర్ అడ్మిషన్లు చేపట్టాలని సీఎం ఆదేశాలు జారీ చేయాల్సి వచ్చింది.

అన్ని విషయాల్లో జోక్యం

సీఎం వద్ద జరిగే రివ్యూల్లో సదరు అధికారి తీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు ఉన్నాయి. ప్రతి విషయంలో అతి జోక్యం చేసుకోవడం, ఇతర అధికారులు ఏదైనా చెప్పే ప్రయత్నం చేస్తుంటే అడ్డుతగలడం, సదరు ఆఫీసర్‌కు పరిపాటిగా మారిందని ఆరోపణలు ఉన్నాయి. విద్యాశాఖ పరిధిలోని ఇతర సంస్థలకు చెందిన సీనియర్ అధికారులను చులకనగా చూడటం సదరు ఆఫీసర్‌కు అలవాటుగా మారినట్లు విమర్శలు ఉన్నాయి. ఆమె వ్యవహారశైలి తీరుతో అటు ప్రభుత్వానికి, ఇటు ఎడుకేషన్ డిపార్ట్ మెంట్‌కు చెడ్డ పేరు వస్తుందని ప్రచారం జరుగుతున్నది.

# చంద్రబాబు ప్రభుత్వంపై
# అంబటి రాంబాబు ధ్వజం



ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్రస్థాయిలో ఆరోపించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి అన్నదాతలను ప్రభుత్వం నిట్టనిలువునా ముంచుతోందని మండిపడ్డారు. వ్యవసాయ రంగంపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో ప్రస్తుత పరిస్థితులే అద్దం పడుతున్నాయని ఆయన విమర్శించారు.

గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు అండగా నిలిచిన అనేక పథకాలను ఈ ప్రభుత్వం నీరుగారుస్తోందని అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. విత్తనాలు, ఎరువుల పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతోందని, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణను ప్రభుత్వం గాలికొదిలేసిందని ఆయన ఆరోపించారు. రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర కల్పించడంలో వైఫల్యం చెందడమే కాకుండా, పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయకుండా రైతులను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, లేనిపక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని అంబటి రాంబాబు హెచ్చరించారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో రైతులకు అందుతున్న సాయంపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు పాలనలో వ్యవసాయం దండగ అనే పరిస్థితిని మళ్ళీ తీసుకువస్తున్నారని, ప్రజలే తగిన సమయంలో బుద్ధి చెబుతారని ఆయన వ్యాఖ్యానించారు.

# పాకిస్తాన్‌లో చమురు సంక్షోభం..
# రాత్రి 9 తర్వాత గ్యాస్ సరఫరా బంద్

మొదటి పేజీ తరువాయి



త్వరగా వంట చేసుకుని తినకపోతే ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. సాయంత్రం టీ చేసుకోవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నట్లు అక్కడి గృహిణులు చెబుతున్నారు. గ్యాస్ సరఫరాకు అనుగుణంగా తమ షెడ్యూల్స్ మార్చుకోవడం అక్కడి వారికి కష్టంగా మారింది. భోజన వేళలు కూడా గ్యాస్ సరఫరాపైనే ఆధారపడి ఉన్నాయి. ప్రస్తుతం మిడిల్ ఈస్ట్ సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా చమురు సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్న సంగతి తెలిసిందే. ఇరాన్ యుద్ధం ఇంకా కొనసాగితే, పాకిస్తాన్‌లో మరింత చమురు సంక్షోభం తప్పదు.

# హైదరాబాద్‌లో
# ఉబెర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విస్తరణ

మొదటి పేజీ తరువాయి



దేశంలోని ప్రధాన నగరాల్లో పార్కింగ్ ప్రధాన సమస్యగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ఇది మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటు పై దృష్టి సారించాలని ఉబెర్ ప్రతినిధులకు ముఖ్యమంత్రి సూచించారు. మెట్రో స్టేషన్ల దగ్గర తగిన పార్కింగ్ సౌకర్యం లేదని ఆయన తెలిపారు. దీని వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈవీ ఛార్జింగ్ సెంటర్లతో పాటు పార్కింగ్ సెంటర్ల ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి సూచనపై తప్పకుండా అధ్యయనం చేస్తామని ఉబెర్ ప్రతినిధి బృందం తెలిపింది.

హైదరాబాద్‌కు సమీపంలో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉబెర్ ప్రతినిధులకు వివరించారు. 30 వేల ఎకరాల్లో నిర్మించే ఈ సిటీ ప్రపంచంలోనే ప్రత్యేకమైనదన్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన 500 కంపెనీలను ఫ్యూచర్ సిటీకి ఆహ్వానిస్తున్నామని, ఇప్పటికే పలు సంస్థలు తమ కార్యకలాపాల కోసం ముందుకు వచ్చాయని సీఎం తెలిపారు. శంషాబాద్ విమానాశ్రయానికి 25 కిలోమీటర్ల దూరంలోనే ఫ్యూచర్ సిటీ ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. గత డిసెంబర్‌లో ఇక్కడ నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో 100కు పైగా కంపెనీలు పాల్గొని పెట్టుబడులకు ముందుకు వచ్చాయని వివరించారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి సీఈఓ దారా ఖోస్రోషాహి ఆసక్తి చూపించారు. ఈ సమావేశంలో ఉబెర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మధు కన్నన్, ఉబెర్ ఇండియా ౘ సౌత్ ఆసియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

# నీటి ప్రాజెక్టులపై కల్వకుంట్ల
# కవిత కీలక వ్యాఖ్యలు



నీటి ప్రాజెక్టుల అంశాన్ని అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసి వాటిని పూర్తి చేయాల్సిన అవసరం ఉందని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఆంధ్రప్రదేశ్ గోదావరి, కృష్ణా నదులపై ఒక్కో ప్రాజెక్టులకు మూడు విధానాలు అమలు చేస్తున్నారని అందులో ఒకటి విఫలమైతే మరొకటి ఆచరణలోకి తీసుకువస్తున్నారని గుర్తు చేశారు. ఏపీ చేస్తున్న ప్రత్యామ్నాయాలు సరే మనం ఎందుకు ఆ రకంగా చేయలేకపోతున్నామని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నీటి పారుదల ప్రాజెక్టుల కోసం లక్ష 80 వేల కోట్లు ఖర్చు చేశారు. ఈ ప్రభుత్వం వచ్చాక కూడా వేలాది కోట్లు నిధులు ఖర్చు చేస్తామంటున్నారు. కానీ ఇప్పటి వరకు గోదావరి, కృష్ణా నీళ్లలో పూర్తి వాటా వాడుకోలేకపోతున్నామన్నారు.

**బీఆర్ఎస్‌లో మాదిరిగా చేయం:** మేము అధికారంలోకి వచ్చాక వాటర్ కమిషన్ ఏర్పాటు చేసి ఈ రెండు నది జలాలను సమర్థవంతంగా వినియోగించుకుంటామన్నారు. జూరాల నుంచి ఏపీకి నీళ్లు వెళ్లే వరకు చిన్న ఆనకట్టు కూడా లేదన్నారు. మేము అధికారంలోకి వచ్చాక వందేళ్లు మన్నిక కలిగి ఉండేలా గేట్లతో కూడిన చెక్ డ్యామ్ లు నిర్మిస్తామన్నారు. గతంలో బీఆర్ఎస్ మాదిరిగా కొట్టుకుపోయేలా చెక్ డ్యామ్ నిర్మించి రెండు ఫోటోలు తీసుకునేలా కాకుండా శాశ్వతంగా ఉండేలా చర్యలు చేపడతామన్నారు. నీటి విషయంలో మా అంతవారే లేరు అని చెప్పుకునే బీఆర్ఎస్ నుంచి ప్రధాన మంత్రి వస్తే ఒక్క ప్రశ్నకూడా ఎందుకు అడగలేదని నిలదీశారు. తెలంగాణ ఏర్పడిందే నీళ్ల కోస అన్నారు. బనకచర్ల విషయంలో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్?ను కలుస్తామన్నారు.

**దేశమంతా పర్యటిస్తాం:** రాజకీయ, విద్యా, ఉద్యోగాల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం దేశవ్యాప్తంగా పర్యటిస్తామని కవిత చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ఆమోదించి పంపించిన బీసీ బిల్లులను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేశారు.

# ప్రధాని పొదుపు విధానాల పై
# ఏపీ లో కార్యాచరణ ప్రణాళిక

మొదటి పేజీ తరువాయి



పశ్చిమ ఆసియాలో నెలకొన్న యుద్ధ మేఘాల నేపథ్యంలో దేశ ఆర్థిక వ్యవస్థపై పడుతున్న భారాన్ని సీఎం ప్రస్తావించారు. యుద్ధ పరిస్థితుల కారణంగా చమురు ధరలు పెరగడం, విదేశీ మారకద్రవ్యంపై ఒత్తిడి పడటం వంటి సవాళ్లు ఎదురవుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్లిష్ట సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించిన '8 పొదుపు సూత్రాల'ను ప్రజలందరూ తూచా తప్పక పాటించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. దేశం క్లిష్ట పరిస్థితిలో ఉన్నప్పుడు ప్రభుత్వాలతో పాటు పౌరులు కూడా బాధ్యతగా వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు.

ముఖ్యంగా పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని వీలైనంత వరకు తగ్గించాలని, తద్వారా విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేయవచ్చని చంద్రబాబు సూచించారు. ప్రధాని పిలుపు మేరకు విదేశీ పర్యటనలు తగ్గించుకోవాలని, విదేశాలకు వెళ్లే బదులు మన దేశంలోని, రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించాలని కోరారు. అలాగే, బంగారం కొనుగోళ్లను కూడా తాత్కాలికంగా నియంత్రించుకోవాలని, ఇది కేవలం వ్యక్తిగత విషయమే కాకుండా దేశ ఆర్థిక ప్రయోజనాలతో ముడిపడి ఉన్న అంశమని ఆయన ప్రజలకు వివరించారు.

దుబారాను అరికట్టడంలో ప్రజాప్రతినిధులే ముందుండాలని ముఖ్యమంత్రి ఒక కీలక నిర్ణయాన్ని ప్రకటించారు. పెద్ద పెద్ద కాన్వాయ్‌లలో వెళ్లడం ఫ్యాషన్‌గా మారిందని, దీన్ని ఇకపై నియంత్రించాల్సిందేనని తేల్చి చెప్పారు. తనతో సహా ప్రజాప్రతినిధులందరూ కాన్వాయ్ వాహనాల సంఖ్యను తగ్గించుకోవాలని, సెక్యూరిటీని కూడా అవసరమైన మేరకు కుదించుకుని ఆదర్శంగా నిలవాలని ఆదేశించారు. 'నా దేశం – నా బాధ్యత' అనే భావన ప్రతి పౌరుడిలో కలగాలని, అప్పుడే సంక్షోభాల నుంచి బయటపడగలమని ఆయన ఉద్ఘాటించారు.

ఆధునిక పని సంస్కృతిపై స్పందిస్తూ 'వర్క్ ఫ్రమ్ హోమ్' అనేది ఇప్పుడు రియాలిటీ అని సీఎం పేర్కొన్నారు. ఇంటి నుంచే ప్రపంచంతో అనుసంధానమై పనిచేసే విధానాన్ని ప్రోత్సహించాలని, ప్రభుత్వ శాఖల్లో కూడా ఈ తరహా విధానాలను ప్రవేశపెట్టే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. దీనివల్ల ప్రయాణ ఖర్చులు, సమయం ఆదా అవుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా దుబారాను తగ్గించాల్సిన ఆవశ్యకత ఉందని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలని కోరారు.

ప్రధాని సూచించిన ఈ 8 అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ పరంగా కూడా పక్కా కార్యచరణ సిద్ధం చేస్తున్నామని, ఒకట్రెండు రోజుల్లో దీనిపై స్పష్టమైన ప్రకటన చేస్తామని చంద్రబాబు వెల్లడించారు. తాత్కాలికంగా వచ్చే ఇబ్బందులను భరిస్తూనే, దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం క్రమశిక్షణతో వ్యవహరించాలని ఆయన కోరారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా భవిష్యత్తును నిర్మిస్తూనే, ప్రస్తుత ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి పొదుపు మంత్రాన్ని పాటించాలని ముఖ్యమంత్రి ఇచ్చిన పిలుపు సభికులను ఆలోచింపజేసింది.

# సైబర్ నేర నియంత్రణలో అప్రమత్తంగా ఉండాలి
## ఏపీ సీఎం చంద్రబాబు



అమరావతి, సైబర్ నేరాలను అరికట్టడంలో మరింతగా టెక్నాలజీని వాడాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ

సైబర్, ఆర్థిక నేరాల నియంత్రణకు యాక్షన్ ప్లాన్ రూపకల్పన చేయాలని కోరారు.ఇతరుల బ్యాంక్ ఖాతాలను సైబర్ నేరగాళ్లు వినియోగించకుండా చేపట్టాల్సిన చర్యలు, గోల్డెన్ అవర్, ఏపీ సైబర్ పాలసీ తదితర అంశాలపై చర్చించారు. సైబర్, ఆర్థిక నేరాలకు సంబంధించి 9.29 లక్షల కాల్స్ బాధితుల నుంచి 1930 టోల్ ఫ్రీ నెంబరుకు ఫిర్యాదులు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

ప్రస్తుతం ఇన్వెస్ట్ మెంట్ ఫ్రాడ్స్ అతిపెద్ద ఆర్థిక నేరంగా మారిందని, ఏపీలో ఇప్పటి వరకూ సైబర్, ఆర్థిక నేరాల్లో రూ.652 కోట్ల మేర కోల్పోయినట్టు,సీఐడీ సైబర్ క్రైమ్ విభాగం- బ్యాంకర్లతో కలిసి రూ.116 కోట్ల పైచిలుకు మొత్తాన్ని సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా కాపాడగలిగామని అధికారులు అన్నారు.

పిషింగ్, విషింగ్, క్రెడిట్, డెబిట్ కార్డు మోసాలు, ఆన్ లైన్ లోన్ ఫ్రాడ్స్ సహా డిజిటల్ అరెస్టుల్లో బాధితులు సొమ్మును కోల్పోతున్నట్టు బ్యాంకర్లతో సమన్వయం చేసుకుని సైబర్ నేరాలను అరికట్టేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సైబర్, ఆర్థిక నేరాల నియంత్రణ కోసం రాష్ట్ర స్థాయిలో సీఐడీ సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ పని చేస్తోందని, విజయవాడ, విశాఖ, తిరుపతిలలో సైబర్ పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రికి డీజీపీ హరీష్ కుమార్ గుప్తా తెలిపారు.

సమీక్షకు మంత్రి పయ్యావుల కేశవ్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, హోంశాఖ కార్యదర్శి కుమార్ విశ్వజిత్, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్.

ఏపీ ఫోరెన్సిక్స్ సలహాదారు కెపీసీ గాంధీ, ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్, బ్యాంకుల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# లిఫ్ట్‌లో ఇరుక్కుని ఐదేళ్ల బాలిక మృతి....

గచ్చిబౌలి : గౌలిదొడ్డిలోని 'మాహి ఉమెన్ పీజీ హాస్టల్'లో ప్రమాదం చోటుచేసుకుంది.జార్ఖండ్‌కు చెందిన బిస్తు ఘోష్ అనే ఐదేళ్ల బాలిక తన తాతయ్య,నానమ్మలతో కలిసి ఇక్కడే నివసిస్తోంది. వారు గత ఏడేళ్లుగా అదే హాస్టల్‌లో చెఫ్‌లుగా పనిచేస్తున్నారు. బుధవారం ఆ చిన్నారి ఐదవ అంతస్తు నుండి లిఫ్ట్‌లో కిందకు వస్తుండగా, మూడవ అంతస్తు వద్ద ప్రమాదం సంభవించింది. పాతకాలపు గ్రిల్డ్ లిఫ్ట్ కావడంతో బాలిక దుస్తులు గ్రిల్‌లో ఇరుక్కుపోయాయి. ఈ క్రమంలో బాలిక తల వెనుక భాగం లిఫ్ట్ కడ్డీల మధ్య బలంగా ఇరుక్కుపోయి తీవ్ర రక్తస్రావం కావడంతో చిన్నారి అక్కడికక్కడే మరణించింది.సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు హాస్టల్ యాజమాన్యం నిర్లక్ష్యం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు....

# వరంగల్ లో రోడ్ల ఊడ్చే (రోడ్డు స్వీపర్) వాహనాలతో వాయు కాలుష్యం

- పరిశుభ్రత పేరుతో ప్రజలకు ముప్పు
- వరంగల్‌లో మెకానికల్ రోడ్డు ఊడ్చి వాహనాలపై తీవ్ర విమర్శలు
- నీటి స్ప్రే లేకుండా ఊడ్చడంతో గాల్లోకి ఎగిరే దుమ్ము
- పెరుగుతున్న వాయు కాలుష్యంపై ప్రజల్లో ఆందోళన
- దుమ్ము మేఘాలతో వాహనదారులకు కనిపించని దారి... ప్రమాదాల భయం
- పిఎం 2.5, పిఎం 10 కణాలతో శ్వాసకోశ సమస్యలు పెరుగుతున్నాయని వైద్యుల హెచ్చరిక
- ఉదయానికి ఇళ్లు, దుకాణాలపై మళ్లీ దుమ్ము పేరుకుపోవడం
- కోట్ల రూపాయల యంత్రాలు...
- పర్యవేక్షణలో లోపం ఆరోపణలు
- కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- పరిశుభ్రత పేరుతో ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలో పెడుతున్నారని ఆందోళన




తెలుగు గళం న్యూస్, వరంగల్, మే 13

గ్రేటర్ వరంగల్ జంట నగరాల్లో పరిశుభ్రతను మెరుగుపరచాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన మెకానికల్ రోడ్డు ఊడ్చే (రోడ్డు స్వీపర్)వాహనాలు ఇప్పుడు ప్రజల్లో తీవ్ర ఆందోళనకు దారి తీస్తున్నాయి. రోడ్లపై పేరుకుపోయిన దుమ్మును తొలగించాల్సిన ఈ యంత్రాలు, వాస్తవానికి అదే ధూళిని గాలిలోకి ఎగదోయడం ద్వారా వాయు కాలుష్యాన్ని పెంచుతున్నాయనే ఆరోపణలు రోజురోజుకూ బలపడుతున్నాయి. ప్రత్యేకంగా అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామున వరకు ట్రాఫిక్ తక్కువగా ఉండే సమయంలో ఈ వాహనాలు పనిచేస్తున్నాయి. అయితే నిబంధనల ప్రకారం నీటిని చల్లుతూ ఊడ్చాల్సి ఉండగా, అనేక ప్రాంతాల్లో ఈ విధానాన్ని పాటించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫలితంగా రోడ్ల పక్కన పేరుకుపోయిన మట్టి, ఇసుక ఒక్కసారిగా గాలిలోకి లేచి దుమ్ము మేఘాలుగా మారుతోంది. ఈ పరిస్థితుల్లో వెనుక నుంచి వచ్చే వాహనదారులకు దారి కనిపించక చిన్నపాటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇక గాలిలోకి వ్యాపించే సూక్ష్మ ధూళి కణాలు (పిఎం 2.5, పిఎం 10) ప్రజల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతున్నాయి. వైద్యుల ప్రకారం ఈ కణాలు నేరుగా ఊపిరితిత్తుల్లోకి చేరి శ్వాసకోశ సమస్యలను పెంచుతున్నాయి. ఇటీవలి కాలంలో అలర్జీలు, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులతో ఆసుపత్రులకు వచ్చే వారి సంఖ్య పెరిగిందని నగరంలోని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా ఆస్తమా బాధితులు, చిన్నపిల్లలు, వృద్ధులు ఈ కాలుష్యానికి ఎక్కువగా గురవుతున్నారు. మరోవైపు, రాత్రి వేళల్లో గాలిలోకి లేచే ఈ దుమ్ము ఉదయానికి ఇళ్ల పైకప్పులు, కిటికీలు, చెట్లు, దుకాణాలపై పేరుకుపోతుంది. దీనివల్ల పరిశుభ్రత మెరుగుపడాల్సింది పోయి, మరింత మురికి పరిస్థితి నెలకొంటోందని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు కూడా ఉదయం దుకాణాలు తెరిచే ముందు మళ్లీ శుభ్రం చేయాల్సిన పరిస్థితి వస్తోందని చెబుతున్నారు. పర్యావరణ నిపుణులు ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నారు. "మెకానికల్ స్వీపింగ్ యంత్రాలు సమర్థవంతంగా పనిచేయాలంటే శక్తివంతమైన వ్యాక్యూమ్ వ్యవస్థ, నీటి స్ప్రే, ధూళిని పట్టుకునే ఫిల్టర్ వ్యవస్థ తప్పనిసరి. ఇవి సరిగా పనిచేయకపోతే శుభ్రత కంటే కాలుష్యం పెరుగుతుంది" అని వారు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న విధానం శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా లేదని కూడా పేర్కొంటున్నారు. కోట్లాది రూపాయల ప్రజా ధనంతో కొనుగోలు చేసిన ఈ వాహనాలు సరైన పర్యవేక్షణ లేకుండా పనిచేస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం, యంత్రాల నిర్వహణలో అలసత్వం వంటి కారణాలు పరిస్థితిని మరింత దిగజారుస్తున్నాయని స్థానికులు అంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు అధికారులకు పలు సూచనలు చేస్తున్నారు:వాహనాలు తిరిగేటప్పుడు తప్పనిసరిగా నీటిని చల్లే విధానం అమలు చేయాలి. ఆధునాతన ఫిల్టర్లు, డస్ట్ కంట్రోల్ సాంకేతికతను ఏర్పాటు చేయాలి. వాహనాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలి. నిబంధనలు పాటించని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి. పరిశుభ్రత పేరుతో ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలో పెట్టడం సమంజసం కాదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో సమీక్ష చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని వరంగల్ నగర వాసులు కోరుతున్నారు.






# హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్

తెలుగు గళం న్యూస్ హన్మకొండ మే 13

వరంగల్ కమిషనరేట్ పరిధిలోని హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఇన్‌స్పెక్టర్ ఎ.మహేందర్ ఆధ్వర్యంలో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ రౌడీ షీటర్లు చట్ట విరుద్ధ కార్యకలాపాలకు, భూ కబ్జాలకు పూర్తిగా దూరంగా ఉండాలని హెచ్చరించారు. సమాజంలో శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడవద్దని స్పష్టం చేశారు. అలాగే భవిష్యత్తులో ఎటువంటి నేర కార్యకలాపాల్లో పాల్గొనకుండా బాధ్యతాయుతమైన పౌరులుగా జీవించాలని సూచించారు. యువత చెడు మార్గాలను విడిచిపెట్టి ఉపాధి, కుటుంబ బాధ్యతలపై దృష్టి పెట్టాలని తెలిపారు. నేరాలకు పాల్పడినట్లయితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



# శాసనసభ్యులు కోరం కనకయ్య చేతుల మీదుగా 'శివాలిక్ పెట్ క్లినిక్' ప్రారంభం

తెలుగు గళం న్యూస్ హైదరాబాద్ మే13



హైదరాబాద్ నగరంలోని శివం రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 'శివాలిక్ పెట్ క్లినిక్'ను ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన నిర్వహించి క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెంపుడు జంతువుల ఆరోగ్య సంరక్షణకు సంబంధించి ఆధునిక వైద్య సేవలు స్థానికంగా అందుబాటులోకి రావడం హర్షణీయమన్నారు. ప్రజలు తమ పెంపుడు జంతువుల చికిత్స కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, అత్యాధునిక సౌకర్యాలతో ఈ క్లినిక్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. క్లినిక్ నిర్వాహకులు డాక్టర్ జయ ప్రకాష్ మాట్లాడుతూ, 'శివాలిక్ పెట్ క్లినిక్'లో పెంపుడు జంతువులకు అవసరమైన సాధారణ తనిఖీలు, వ్యాక్సినేషన్, సర్జరీలు మరియు అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. జంతు ప్రేమికులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్ కమిషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్ రెడ్డి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి మూడ్ శోభన్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ఎస్.కె. ఫతే మహమ్మద్, ఖమ్మం జిల్లా నాయకులు ఏపూరి మహేందర్, కాంగ్రెస్ మండల నాయకులు అంబటి రాంబాబు, పుల్ సింగ్, భూక్యా లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ హాట్కర్ పార్వతి, క్లినిక్ సిబ్బంది హాట్కర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఓయూ విద్యార్థి నేత డా. ఆర్. ఎల్. మూర్తికి డాక్టరేట్ ప్రదానం

- ఓయూ విద్యార్థి నేత డా. ఆర్. ఎల్. మూర్తికి ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం
- పేద గ్రామీణ నేపథ్యం నుంచి ఉన్నత విద్యలో విజయం సాధించిన మూర్తి
- జనగామ జిల్లా తమ్మడపల్లి జి గ్రామానికి చెందిన రాపర్తి కుటుంబం
- సమాజ శాస్త్రంలో "ప్రత్యామ్నాయ రాజకీయాల ఆవిర్భావం"పై పరిశోధన
- కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎంఎస్సీ గణితం, బీఈడీ పూర్తి
- నిజాం కళాశాలలో సమాజ శాస్త్రంలో పీజీ, గ్రంథాలయ శాస్త్రంలో మాస్టర్స్ పూర్తి
- ఓయూ ఆర్ట్స్ కళాశాలలో సమాజ శాస్త్రంలో పీహెచ్డీ సాధన
- ఎస్ఎఫ్ఐలో కార్యకర్తగా ప్రారంభించి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎదిగిన ప్రయాణం
- కేంద్ర కమిటీలో ఆరు సంవత్సరాలు సేవలు
- దేశవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలకు నాయకత్వం
- ప్రస్తుతం డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ గా..
- విద్యతో పాటు ఉద్యమాలు, ఆందోళనలు కొనసాగించిన ప్రత్యేకత
- "పుస్తకం ఒక చేతిలో -- జెండా మరో చేతిలో" నినాదంతో ముందుకు సాగిన జీవితం
- గ్రామీణ యువతకు స్ఫూర్తిగా నిలిచిన విజయగాథ
- కుటుంబ సభ్యులు, ఉద్యమ నాయకులు, గ్రామ ప్రజల అభినందనలు వెల్లువ



పేద గ్రామీణ నేపథ్యంలో జన్మించి, విద్యను వ్యక్తిగత ప్రగతికి మాత్రమే కాకుండా సమాజ మార్పు కోసం వినియోగించాలనే లక్ష్యంతో ముందుకు సాగిన ఓయూ విద్యార్థి నేత డా. ఆర్. ఎల్. మూర్తి గారికి ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది.జనగామ జిల్లా, జఫర్‌గడ్ మండలం, తమ్మడపల్లి గ్రామానికి చెందిన రాపర్తి శివయ్య, యాకమ్మల చిన్న కుమారుడైన మూర్తి కమ్యూనిస్టు భావజాలం కలిగిన కుటుంబంలో పెరిగారు. ఆయన సోదరుడు రాపర్తి రాజు ప్రస్తుతం జనగామ జిల్లా సీఐటీయూ అధ్యక్షుడిగా, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడిగా సేవలందిస్తున్నారు.డా. మూర్తి ఉస్మానియా విశ్వవిద్యాలయం సమాజ శాస్త్ర విభాగంలో "ఐడియాలాజికల్ అలయన్స్ అండ్ ఎమర్జెన్స్ ఆఫ్ ఆల్టర్నేటివ్ పాలిటిక్స్: యాన్ అనలిటికల్ స్టడీ ఆఫ్ తెలంగాణ స్టేట్" ("విచారధారల ఐక్యం మరియు ప్రత్యామ్నాయ రాజకీయాల ఆవిర్భావం –తెలంగాణ రాష్ట్రంపై విశ్లేషణాత్మక అధ్యయనం") అనే సమకాలీన రాజకీయ--సామాజిక అంశంపై లోతైన పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు.చిన్ననాటి నుంచే చదువుపై ఆసక్తి, సమాజంపై అవగాహన కలిగిన ఆయన కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎంఎస్సీ గణితం, బీఈడీ పూర్తి చేశారు. అనంతరం నిజాం కళాశాలలో సమాజ శాస్త్రంలో పీజీ, ఓయూ ఆర్ట్స్ కళాశాలలో గ్రంథాలయ శాస్త్రంలో మాస్టర్స్ పూర్తి చేసి, అదే కళాశాలలో సమాజ శాస్త్రంలో పీహెచ్డీ సాధించారు. విద్యను అభ్యసిస్తూ, విద్యార్థుల హక్కులు, నిరుద్యోగ యువత సమస్యలు, ప్రజా అంశాలపై నిరంతరం పోరాడారు. ఎస్ఎఫ్ఐలో సాధారణ కార్యకర్తగా ప్రారంభమైన ఆయన ప్రయాణం రాష్ట్ర అధ్యక్షుడి స్థాయికి ఎదిగి, ఉద్యమ చరిత్రలో ప్రత్యేక గుర్తింపు పొందింది. కేంద్ర కమిటీలో ఆరు సంవత్సరాలు పనిచేసి దేశవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలకు నాయకత్వం వహించారు. ప్రస్తుతం డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ నిరుద్యోగ యువత సమస్యలపై పోరాటం కొనసాగిస్తున్నారు. ఉద్యమాలు, ఆందోళనలు, అరెస్టులు, సభలు... ఇవన్నీ మధ్య కూడా చదువును కొనసాగిస్తూ, సామాజిక బాధ్యతను నిలబెట్టుకున్న ఆయన ప్రయాణం నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. "పుస్తకాన్ని ఒక చేతిలో... జెండాను మరో చేతిలో..." అనే నినాదంతో సాగిన ఆయన జీవన ప్రయాణం అధ్యయనం మరియు పోరాటం కలిసి సాగవచ్చని నిరూపించింది.ఈ డాక్టరేట్ ఆయన వ్యక్తిగత విజయమే కాకుండా, గ్రామీణ నేపథ్యంలోనూ ఉద్యమ జీవితాన్ని కొనసాగిస్తూ ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని నిరూపించిన విజయగాథగా పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, మిత్రులు, ఉద్యమ నాయకులు, విద్యార్థి--యువజన సంఘాల నాయకులు, గ్రామ ప్రజలు డా. ఆర్. ఎల్. మూర్తిని ఘనంగా అభినందించారు.



# మొక్కజొన్న, వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సత్య శారద



తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/మే 13

వరంగల్ జిల్లా: వర్ధన్నపేట, పర్వతగిరి మండలాల్లోని వరి, మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆకస్మికంగా తనిఖీ చేశారు.

బండవతాపూర్, చెరువు ముందు తండా, రాయపర్తి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ, పిఏసిఎస్ కొనుగోలు కేంద్రాలతో పాటు వర్ధన్నపేటలోని ఏఎంసీ గోదామును కలెక్టర్ సందర్శించారు. "రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి"

కేంద్రాల్లో రైతులకు అందిస్తున్న సౌకర్యాలు, ధాన్యం కొనుగోలు ప్రక్రియ, తేమ శాతం పరీక్షలు, గన్నీ బ్యాగుల లభ్యత, ధాన్యం నిల్వలు, రవాణా ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో ధాన్యం కొనుగోలు చేపట్టాలని, చెల్లింపులు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ, కూర్చునే సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఐకేపీ కేంద్రాల నిర్వహణ, రికార్డుల నిర్వహణను పరిశీలించి పలు సూచనలు చేశారు.

### రైస్ మిల్లు ఆకస్మిక తనిఖీ


అనంతరం వర్ధన్నపేటలోని వీరభద్ర రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు నిర్లక్ష్యం చేయకుండా దించుకోవాలని రైస్ మిల్లర్‌ను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వరంగల్ ఆర్డీవో సుమ, తాసిల్దార్ విజయ్ సాగర్, డీసీఎస్ఓ కిష్టయ్య, డీఎం సివిల్ సప్లై సంధ్యారాణి, ఎంపీడీవోలు వెంకటరమణ, వ్యవసాయ శాఖ అధికారులు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

# డిజిటల్ అయాన్ సెంటర్‌లో విద్యార్థులపై అక్రమ వసూళ్లు..!

## ●ఐసెట్ అభ్యర్థుల నుంచి బలవంతపు వసూళ్లు ● ప్రైవేట్ పరీక్షా కేంద్రాల దోపిడీపై ఆగ్రహం






తెలుగు గళం న్యూస్ మల్కాజ్గిరి-మేడ్చల్, మే 13

కీసరలోని టిసిఎస్ ఐఓఎన్ డిజిటల్ జోన్ డిజిటల్ అయాన్ సెంటర్‌లో చోటుచేసుకున్న ఘటన విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాసంఘాల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఐసెట్ ప్రవేశ పరీక్ష సందర్భంగా పరీక్షకు హాజరైన అభ్యర్థుల వద్ద నుంచి బ్యాగులు, మొబైల్ ఫోన్లు వంటి వ్యక్తిగత వస్తువులు డిపాజిట్ చేసేందుకు ఒక్కొక్కరికి రూ.50 చొప్పున వసూలు చేయడం వివాదాస్పదంగా మారింది. పరీక్షా కేంద్రాల్లో సాధారణంగా విద్యార్థుల భద్రత, సౌకర్యాల కోసం తగిన ఏర్పాట్లు చేయాల్సి ఉండగా, కీసరలోని ఈ కేంద్రంలో మాత్రం ఎలాంటి ప్రత్యామ్నాయ సదుపాయం లేకుండా "డబ్బులు చెల్లిస్తేనే వస్తువులు ఉంచాలి" అనే పరిస్థితి నెలకొల్పినట్లు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. పరీక్ష సమయానికి ఆలస్యమవుతుందనే ఆందోళనతో చాలామంది గత్యంతరం లేక రూ.50 చెల్లించాల్సి వచ్చిందని వారు వాపోతున్నారు.ఈ విషయంపై కొందరు విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రశ్నించగా నిర్వాహకులు నిర్లక్ష్యంగా స్పందించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. "ఇది ప్రైవేట్ సంస్థ... మా ఇష్టం వచ్చినట్లు రేట్లు నిర్ణయిస్తాం... ఇష్టం లేకపోతే బయట రోడ్డుపై పెట్టి వెళ్లండి" అని చెప్పినట్లు సమాచారం. ఈ వ్యాఖ్యలు విద్యార్థులపై ఒత్తిడి తీసుకురావడమే కాకుండా, వారి బలహీన పరిస్థితిని ఆసరాగా చేసుకున్న బహిరంగ దోపిడీకి నిదర్శనమని తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఇంకా ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, ఈ అంశంపై ఫిర్యాదు చేయడానికి లేదా స్పందించే బాధ్యతాయుత అధికారులు కేంద్రంలో అందుబాటులో లేకపోవడం. పరీక్ష నిర్వహణలో పారదర్శకత, బాధ్యత అనే అంశాలు పూర్తిగా కనుమరుగయ్యాయని విద్యార్థులు విమర్శిస్తున్నారు. ఈ ఘటనపై బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తల్లూరి వెంకట్ కౌశిక్ తీవ్రంగా స్పందించారు. "విద్యార్థులను ఆదాయ వనరులుగా చూసి ప్రైవేట్ సంస్థలు అక్రమ వసూళ్లకు పాల్పడటం దారుణం. వెంటనే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతాం" అని హెచ్చరించారు. విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నది ఏమిటంటే---

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాల్లో ఉచిత లాకర్ లేదా డిపాజిట్ సదుపాయం తప్పనిసరిగా కల్పించాలని, విద్యార్థుల భద్రతను వాణిజ్యంగా మార్చే చర్యలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేస్తున్నారు.ఈ ఘటన ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. పరీక్షా కేంద్రాల్లో జరుగుతున్న ఇలాంటి అక్రమ వసూళ్లపై ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో అన్నది ఆసక్తికరంగా మారింది.





# బీసీ, ఓబీసీ లైజనింగ్ అధికారిగా రామకృష్ణ నియామకం

## సత్తుపల్లి ఏరియాలో ఐఎన్టీయూసీ నేతల అభినందనలు

సత్తుపల్లి, ఆర్ సి,మే13 (తెలుగుగళం) న్యూస్: సింగరేణి సత్తుపల్లి ఏరియాలోని కిష్టారం ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ బుడిగం రామకృష్ణను ఏరియా బీసీ, ఓబీసీ లైజనింగ్ అధికారిగా నియమిస్తూ సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఫిట్ సెక్రటరీ బాలాజీ ఆధ్వర్యంలో ఆయనను శాలువాతో సత్కరించి అభినందించారు.

ఈ సందర్భంగా సత్తుపల్లి ఏరియా ఐఎన్టీయూసీ జాయింట్ జనరల్ సెక్రటరీ తీగల క్రాంతికుమార్ మాట్లాడుతూ.. కార్మికుల పట్ల గౌరవం, క్రమశిక్షణ, నిజాయితీతో విధులు నిర్వహిస్తున్న రామకృష్ణకు ఈ బాధ్యతలు అప్పగించడం సముచిత నిర్ణయమని పేర్కొన్నారు. అవినీతి, అక్రమాలకు తావులేకుండా నిబద్ధతతో పనిచేసే అధికారిగా ఆయనకు మంచి గుర్తింపు ఉందన్నారు.

ఈ నియామకానికి సహకరించిన సింగరేణి బీసీ, ఓబీసీ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నల్లపూరి రమేష్‌తో పాటు ఇతర నాయకులకు క్రాంతికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఐఎన్టీయూసీ కాంట్రాక్ట్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ షేక్ బాజీ, దొంతిమళ్ల శ్రీనివాస్, రాజశేఖర్, రాంసింగ్, నజీర్, యాకూబ్, కోటి, బుక్క శ్రీనివాస్, బావ రమేష్, షణ్ముఖ చారి తదితరులు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ సీనియర్ నేత మాడ్గుల కొమురయ్య

## చిత్రపటానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి నివాళులు



తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/మే 13


వరంగల్ జిల్లా: పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కీ.శే. మాడ్గుల కొమురయ్య మృతి చెందడంతో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. పర్వతగిరి గ్రామంలో కొమురయ్య నివాసానికి వెళ్లిన మాజీ మంత్రి ఎర్రబెల్లి, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఆయన వెంట మాజీ ఎంపీటీసీ మాడ్గుల రాజు ఉన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన గ్రామ సర్పంచ్ గాడిపెల్లి మహేందర్

**తెలుగు గళం న్యూస్, పర్వతగిరి / మే 13 :**

వరంగల్ జిల్లా:పర్వతగిరి మండలం అన్నారం గ్రామ సర్పంచ్ గాడి పెల్లి మహేందర్ బుధవారం అన్నారం షరీఫ్ గ్రామంలో నా చిన్ననాటి మిత్రుడు ఇరగని అశోక్ ప్రధమ పుత్రుడు చిరంజీవి సాయి, నా క్లాస్మేట్ మిత్రుడు రావుల శ్రీనువాస్ కుమార్తె వివాహ కార్యక్రమ మహోత్సవంలో నూతన దంపతులను ఆశీర్వదించినారు.

అన్నారం గ్రామ సర్పంచ్ గాడి పెల్లి మహేందర్ తో పాటు 10వ తరగతి క్లాస్మేట్ మిత్రులు నజీముద్దీన్ సమ్మయ్య రమేష్ మధుకర్ మల్లేష్ సారంగపాణి శ్యామ్ ఐలయ్య శ్రీనివాస్ మరియు పర్వతగిరి సర్పంచ్ చిదురు శంకర్ దూప తండా సర్పంచ్ ధర్మసూద్ తిరుపతి నాయక్ మరియు క్లాస్మేట్ మిత్రులు పాల్గొన్నారు.



# కారు అదుపుతప్పి బోల్తా: తొమ్మిదేళ్ల బాలుడు మృతి

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ

అతివేగం, అజాగ్రత్త ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకున్నాయి.బంధువుల పెళ్లికి వెళ్లి సంతోషంగా తిరిగి వస్తున్న ఆ కుటుంబంలో కారు ప్రమాదం తీరని విషాదాన్ని నింపింది.పోలీసుల కథనం ప్రకారం.. హన్మకొండ జిల్లా నడికుడ గ్రామానికి చెందిన వూర హిమాంశ్ (9) అనే బాలుడు తన తల్లి, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల పెళ్లి వేడుకకు వెళ్లారు. బుధవారం మధ్యాహ్నం వివాహం ముగించుకుని తమ బంధువైన మాదారం భాస్కర్ రావుకు చెందిన కారు (AP15 BM D 2345)లో తిరిగి వస్తుండగా, రేగొండ మండలంలోని నారాయణపూర్ గ్రామ శివారులో గల నేషనల్ హైవే 353-సి వద్ద ప్రమాదం సంభవించింది. భాస్కర్ రావు కారును అతివేగంగా, నిర్లక్ష్యంగా నడపడం వల్ల అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది.ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారందరికీ తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తొలుత ఎస్ఎస్ఆర్ ఆసుపత్రికి తరలించారు. అయితే బాలుడు హిమాంశ్ పరిస్థితి విషమంగా ఉండటంతో, మెరుగైన చికిత్స కోసం వరంగల్‌లోని అజర ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మధ్యాహ్నం 3:20 గంటల సమయంలో మృతి చెందాడు. కారు నడిపిన మాదారం భాస్కర్ రావు నిర్లక్ష్యం వల్లే తన కుమారుడు మృతి చెందాడని మృతుడి తండ్రి వూర రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు రేగొండ ఎస్ఐ డి.సుధాకర్ మాట్లాడుతూ.. అతివేగం, అజాగ్రత్తే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.చిన్న వయసులోనే హిమాంశ్ మృతి చెందడంతో నడికుడ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తీరు స్థానికులను కలచివేసింది.






# విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం

## ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజండ్ల సాయికుమార్






తెలుగు గళం న్యూస్, ఖమ్మం పట్టణం మే 14, ఖమ్మం జిల్లా : నరేంద్ర మోడీ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక గత పది సంవత్సరాల్లో 89 రకాల పరీక్ష పేపర్లు లీక్ అవ్వడం ప్రపంచ చరిత్రలోనే ఆశ్చర్యకర విషయమని భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన నాటి నుండి ఇటువంటి చేతకాని ప్రధానమంత్రిని భారతదేశం ఎప్పుడు చూడలేదని యువజన కాంగ్రెస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు వేజండ్ల సాయికుమార్ అన్నారు, 22 లక్షల మంది విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం వ్రాసుకున్న నీట్ పరీక్ష పత్రం లీక్ అవ్వడాన్ని నిరసిస్తూ, కేంద్ర ప్రభుత్వ చేతకానితనం వల్లనే దేశంలో ఇటువంటి పరిణామాలు జరుగుతున్నాయని, తక్షణం ప్రధానమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం లోని స్థానిక జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయం కూడలి వద్ద ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజండ్ల సాయికుమార్ ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి, నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమం లో స్టేట్ సెక్రటరీ అంజనీ, యాసిన్, బెజ్జం బాల గంగాధర్, నెల్లూరి ఉపేందర్, కొండూరి హృదయ్ కిరణ్, బెల్లం సాయి తేజ, అంబటి ఈశ్వర్, రాజేష్, సన్నీ, యడ్లపల్లి తరుణ్, యశ్వంత్, ఖాదర్ బాబా, చల్లగొండ్ల సాయి తేజ, మల్లెల గాంధీ, సంపత్ మరియు యువజన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కుక్కల రాజేందర్ పార్థివదేహానికి నివాళులు

## కాంగ్రెస్ నేతల సంతాపం

తెలుగు గళం న్యూస్ జఫర్గడ్/మే 13

జనగామ జిల్లా: ఘనపూర్ నియోజకవర్గం జాఫర్‌గడ్ మండల కేంద్రంలోని వద్దెగూడేనికి చెందిన కుక్కల రాజేందర్ మరణించడంతో వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ఆదేశాల మేరకు కాంగ్రెస్ నేతలు ఆయన పార్థివదేహానికి నివాళులర్పించారు. జాఫర్‌గడ్‌లో ఒగ్గు మాధవి తమ్ముడు కుక్కల రాజేందర్ భౌతికదేహాన్ని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యం, వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం రాజేందర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు పోశాల వెంకన్న గౌడ్, ఈగ దామోదర్, మరుపట్ల సాయికుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ పార్టీ నాయకుల పరామర్శ

యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని 5వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గడ్డం చంద్రం గౌడ్ మాతృమూర్తి ఆదివారం రోజున కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు సోమవారం వారి నివాసానికి చేరుకుని నివాళులర్పించారు. ఈ సందర్భంగా శోకతప్త హృదయంతో ఉన్న చంద్రం గౌడ్ మరియు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ పరామర్శించిన వారిలో యాదగిరిగుట్ట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కరే వెంకటయ్య, పట్టణ జనరల్ సెక్రటరీ పాపట్ల నరహరి, పార్టీ సీనియర్ నాయకులు మటూరి బాలయ్య, నాయకులు యాకూబ్, మరియు భక్త కన్నప్ప తదితరులు ఉన్నారు. ఈ కష్టకాలంలో పార్టీ నాయకులు చంద్రం గౌడ్ కుటుంబానికి అండగా ఉంటారని వారు భరోసా ఇచ్చారు.

# జాప్యం లేకుండా ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలి

## ● జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశం





**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కాటారం/ మలహార్**

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎటువంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు.బుధవారం ఆయన కాటారం మండలం కొత్తపల్లి,కాటారం వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని కొనుగోలు కేంద్రాలతో పాటు,మలహార్ మండలంలోని కొండంపేట, కొయ్యూరు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వ ఉన్న ధాన్యం, మౌలిక వసతులను పరిశీలించిన కలెక్టర్, అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా తార్పాలిన్లను సరిపడా అందుబాటులో ఉంచాలని సూచించారు.రవాణాలో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, ప్రతి కొనుగోలు కేంద్రానికి రోజుకు కనీసం రెండు లారీలను కేటాయించాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు.కొనుగోలు కేంద్రాల్లో పక్కాగా రిజిస్టర్లు నిర్వహించి,ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని స్పష్టం చేశారు.రైతులు మిల్లులకు పంపే ధాన్యంలో తాలు, రాళ్లు, మట్టి గుల్లలు లేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించేలా అధికారులు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.ధాన్యం శుభ్రపరిచేందుకు అవసరమైన ప్యాడీ క్లీనింగ్ పరికరాలు అందుబాటులో లేని చోట, ఇతర కేంద్రాల నుండి తెప్పించి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని మిల్లులకు పంపడంలో రైతులు కూడా అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.ఈ క్షేత్రస్థాయి పర్యటనలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డీఆర్ఓ వసంత కుమారి,పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్,డి.ఎం రాములు,జిల్లా సహకార అధికారి వాలియా నాయక్,వ్యవసాయ అధికారి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.





# పలు నూతన వధూవరులను దీవించిన మాజీ టిస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు

**తెలుగు గళం న్యూస్, ఐనవోలు / మే 13 :**



మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు బుధవారం వంచనగిరి గ్రామంలోని కొల్లూరి సుమలత – రవీందర్ పుత్రిక రక్షిత – రాజేష్ దంపతుల వారి వివాహానికి హాజరై, హంటర్ రోడ్ లోని (పి ఆర్ ఆర్ ) ఫంక్షన్ హాల్ లోని అయినవోలుకు సంబంధించిన బరిగెల కవిత నాగయ్య ఏకైక పుత్రుడు క్రాంతి కుమార్ – అక్షిత గార్ల వివాహ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించినారు.



మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు వెంట గ్రామ ఉపసర్పంచ్ బరిగెల భాస్కర్ , మాజీ సర్పంచ్ జన్ను కుమార్ స్వామి, సునీల్, జెన్నీ, తదితరులు పాల్గొన్నారు.

# విద్యా అభివృద్ధికి సర్పంచులు, కౌన్సిలర్ల భాగస్వామ్యం తప్పనిసరి

## ఎమ్మెల్యే నాగరాజు



తెలుగు గళం న్యూస్ వర్ధన్నపేట/మే 13

వరంగల్ జిల్లా:విద్యా అభివృద్ధికి గ్రామస్థాయి ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం అత్యంత కీలకమని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కెఆర్ నాగరాజు అన్నారు.ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా వర్ధన్నపేట మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన ప్రత్యేక విద్యా వారోత్సవాల వర్క్‌షాప్‌లో ఎమ్మెల్యే నాగరాజు, జిల్లా కలెక్టర్ సత్య శారదా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులకు పాఠశాల విద్యా కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. పాఠశాలల బలోపేతం అందరి బాధ్యత ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ...

"తెలంగాణ ప్రభుత్వం విద్యా రంగాన్ని అత్యంత ప్రాధాన్యతతో తీసుకుంటోంది. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించేందుకు అనేక సంస్కరణలు చేపడుతున్నారు. విద్య సమాజ అభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు,స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం అవసరమని స్పష్టం చేశారు. "పాఠశాలల అభివృద్ధి కేవలం ఉపాధ్యాయుల బాధ్యత కాదు. గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, స్థానిక సంస్థలు కలిసి పని చేసినప్పుడే మంచి ఫలితాలు వస్తాయి" అన్నారు. ప్రతి గ్రామంలో సర్పంచులు పాఠశాలల పరిస్థితిని తరచూ పరిశీలించాలని, విద్యార్థుల హాజరు, పరిశుభ్రత, తాగునీటి వసతి, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజన నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు విశ్వాస కేంద్రాలు కావాలి. ప్రత్యేక విద్యా వారోత్సవాలు విద్యార్థుల్లో విద్యాపట్ల ఆసక్తిని పెంచడమే కాకుండా పాఠశాలల పట్ల సమాజ బాధ్యతను కూడా పెంచుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రజల విశ్వాస కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్మన్ నేతావాత్ శిభారాణి– రాజేందర్, ఫ్యాక్స్ చైర్మన్ రాజేష్ ఖన్నా,మార్కెట్ చైర్మన్ నరకుడు వెంకటయ్య ,కౌన్సిలర్లు బెజ్జం పాపారావు,నునావత్ కమ్లి–కీమా నాయక్,మలోత్ దేవేందర్, తిరుపెల్లి వాణి–కుమారస్వామి, జడ్పీ సీఈవో రామ్ రెడ్డి, ఆర్డిఓ సుమ, ఎంపీడీవో, ఎంఈఓ, టౌన్ పార్టీ అధ్యక్షుడు మైస సురేష్, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# పెద్దంపల్లి పంచాయతీకి నిధులిచ్చింది బీఆర్ఎస్సే



**తెలుగు గళం న్యూస్ రేగొండ**

మండల పరిధిలోని పెద్దంపల్లి గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి నిధులు ఇచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వం అయితే,తామే ఇచ్చామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు (జీఎస్సార్) చెప్పుకోవడం సిగ్గుచేటని బీఆర్ఎస్ మండల నాయకుడు పసుల రత్నాకర్ విమర్శించారు.బుధవారం నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చొరవతో పెద్దంపల్లి గ్రామానికి కోటి రూపాయల నిధులు మంజూరయ్యాయని తెలిపారు.ఆ నిధులతోనే గ్రామ పంచాయతీ భవన నిర్మాణం, స్మశాన వాటిక, సీసీ రోడ్లు వంటి అనేక అభివృద్ధి పనులు చేపట్టామని గుర్తు చేశారు.ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గెలిచినప్పటి నుండి ఈ గ్రామానికి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదని,పైగా పంచాయతీ భవనానికి 20 లక్షల ఉపాధి హామీ నిధులు ఇచ్చానని అబద్ధాలు ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదమని దుయ్యబట్టారు.గ్రామ పంచాయతీ భవన ప్రారంభోత్సవ సమయంలో కనీసం వార్డు మెంబర్లతో కూడా కొబ్బరికాయ కొట్టించకుండా పాలకవర్గాన్ని,గ్రామస్తులను ఎమ్మెల్యే అవమానించారని ఆరోపించారు.గ్రామంలో రోడ్డు నిర్మించాలని నిలదీసిన మహిళల పట్ల ఎమ్మెల్యే దురుసుగా మాట్లాడటం ఆయన అహంకారానికి నిదర్శనమని పసుల రత్నాకర్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెద్దంపల్లికి ఎన్ని నిధులు కేటాయించారో ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా ప్రచార ఆర్భాటాలు మానుకుని గ్రామానికి కొత్త నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని,లేనిపక్షంలో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పెద్దంపల్లి ఉప సర్పంచ్ సకినాల రవీందర్,వార్డు సభ్యులు అంబటి కార్తీక్, మడికొండ భార్గవి, నాయకులు వజీర్ నివాస్, వజీరు భోగి,బోదాసు రాజు,బోదాస్ మల్లేష్,శీలమంతుల నరసింహమూర్తి, వజిన పల్లి పూర్ణ చందు,పసుల రాజు,సకినాల రజనీకాంత్,గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే తీరుకు నిరసనగా గ్రామంలో పలువురు తమ నిరసన వ్యక్తం చేశారు.

# సామాన్యుడికి ఒక చట్టం, మంత్రి కొడుకుకు మరో చట్టమా?

## ● బండి భగీరథ్ అరెస్టుకు మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ డిమాండ్

**తెలుగు గళం న్యూస్ వర్ధన్నపేట/మే 13**



వరంగల్ జిల్లా,పోక్సో కేసులో నిందితుడైన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ డిమాండ్ చేశారు. వర్ధన్నపేటలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో కలిసి ప్రెస్‌మీట్ నిర్వహించిన అరూరి రమేష్, న్యాయం అందరికీ ఒక్కటే ఉండాలి. తెలంగాణలో సామాన్యులకు ఒక చట్టం,ప్రముఖులకు మరో చట్టం అమలవుతుందా? అని ప్రశ్నించారు. అధికార మదంతో కేసులను నీరుగార్చడం దేశంలో ఎక్కడ పోక్సో కేసు నమోదైనా నిందితులను వెంటనే అరెస్టు చేస్తారు. కానీ బండి సంజయ్ కొడుకు విషయంలో ప్రత్యేక చట్టాలు అమలు అవుతున్నట్లు కనిపిస్తోంది. రేవంత్ రెడ్డికి, బీజేపీకి లోపాయికారి ఒప్పందం వల్లే ఇంకా అరెస్టు జరగలేదు" అని ఆరోపించారు.

కేసును నీరుగార్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసిందని, "రాష్ట్రంలో జరిగే ప్రతి పోక్సో కేసుపై సిట్ వేసి విచారణ చేస్తారా?"అని విమర్శించారు. కుమారుడిని పోలీసుల ఎదుట హాజరుపరచాలి

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ సామాజిక బాధ్యతగా తన కుమారుడిని పోలీసుల ఎదుట హాజరుపరిచి విచారణకు సహకరించాలని, లేనిపక్షంలో కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేసి రాజకీయాల నుంచి తప్పుకోవాలని అరూరి రమేష్ డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువయ్యాయి 10 ఏళ్లలో కెసిఆర్ హయాంలో రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి చెందితే, రెండున్నర ఏళ్లలో క్రైమ్‌లో అభివృద్ధి చెందింది. రాష్ట్రంలో పెట్టుబడులు రాలేదు కానీ రోజుకో అత్యాచారం జరుగుతోంది" అని వ్యాఖ్యానించారు. బాధితులకు తగిన న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మార్గం బిక్షపతి, పిఎసిఎస్ చైర్మన్లు వనం రెడ్డి, జక్కు రమేష్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు తుల్ల కుమార స్వామి, మధుసుధన్, మార్త సారంగపాణి, సిలివేరు శ్రీధర్ యాదవ్ ,కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కాటారం నూతన ఆర్డీఓ రవీందర్

**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**



కాటారం రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ)గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డి. రవీందర్ బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను ఐడీఓసీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు ఆయన మొక్కను అందజేసి అభివాదం చేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్డీఓ రవీందర్‌కు కలెక్టర్ రాహుల్ శర్మ శుభాకాంక్షలు తెలియజేస్తూ, విధి నిర్వహణలో అనుసరించాల్సిన కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు.( పభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల అమలులో సమర్థవంతంగా పనిచేయాలని, ముఖ్యంగా రెవెన్యూ పరంగా ప్రజలకు ఎదురయ్యే సమస్యలను పారదర్శకమైన పద్ధతిలో పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ సేవలు సామాన్య ప్రజలకు వేగంగా అందేలా చొరవ చూపాలని కలెక్టర్ పేర్కొన్నారు.అనంతరం ఆర్డీఓ డి.రవీందర్ మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా ,ప్రభుత్వ ప్రాధాన్యతలను దృష్టిలో ఉంచుకుని విధులు నిర్వహిస్తానని తెలిపారు.కాటారం డివిజన్ పరిధిలోని ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, పారదర్శకమైన పాలన అందించేందుకు తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.

# డీసీ తండాలో దుర్గమ్మ గుడి ప్రారంభం

## ఎమ్మెల్యే నాగరాజు ప్రత్యేక పూజలు

**తెలుగు గళం న్యూస్ వర్ధన్నపేట/మే 13**

వరంగల్ జిల్లా: వర్ధన్నపేట మున్సిపల్ పరిధి 6వ వార్డు డీసీ తండాలో నూతనంగా నిర్మించిన శ్రీ దుర్గమ్మ దేవాలయంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కెఆర్ నాగరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, తండావాసులు ఎమ్మెల్యే నాగరాజుకు ఘన స్వాగతం పలికారు. అమ్మవారి ఆశీస్సులు పొందిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ," ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించాను"అని తెలిపారు. దేవాలయాలు సమైక్యతకు ప్రతీకలు

"గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణం ప్రజల్లో ఐక్యతను, భక్తి భావాన్ని పెంపొందిస్తుంది. దేవాలయాలు సామాజిక సమైక్యతకు ప్రతీకలు. గ్రామాభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక అభివృద్ధి కూడా సమానంగా కొనసాగాలి" అని ఎమ్మెల్యే నాగరాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ నేతావత్ శిభారాణి–రాజేందర్, 6వ వార్డు కౌన్సిలర్ మాలోతు దేవేందర్, 1వ వార్డు కౌన్సిలర్ బెజ్జం పాపారావు,4వ వార్డు కౌన్సిలర్ నునావత్ కమ్లి–కీమా నాయక్, వర్ధన్నపేట మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ పాల్గొన్నారు.

వీరితో పాటు పోశాల వెంకన్న, అన్వర్, రజిత, తారాబాయి, శ్రీకాంత్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, తండావాసులు, ఆలయ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



# ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ అభినందనీయం: రజక విద్యార్థి విభాగం ఇంచార్జి కోరపల్లి రాజేష్

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి గణపురం

ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను రజక విద్యార్థి విభాగం జిల్లా ఇంచార్జి కోరపల్లి రాజేష్ ఘనంగా సన్మానించారు.జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం నారాయణగిరి పల్లె గ్రామానికి చెందిన వేల్పుల లహరి (532 మార్కులు), వేల్పుల వర్షత (526 మార్కులు) పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన సందర్భంగా వారి నివాసంలో బుధవారం ఈ అభినందన సభ నిర్వహించారు. వేల్పుల సాంబయ్య కుమార్తె వర్షత,అరుణ్ కుమార్తె లహరి ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ,ప్రైవేటు పాఠశాలలకు దీటుగా 600 మార్కులకు గాను ఇంతటి ఉత్తమ మార్కులు సాధించడం పట్ల రాజేష్ హర్షం వ్యక్తం చేశారు .ఈ సందర్భంగా విద్యార్థినులకు శాలువా కప్పి,మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ,క్రమశిక్షణతో చదివితే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని ఈ విద్యార్థినులు నిరూపించారని కొనియాడారు .తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, వారి ఉన్నత చదువులకు ప్రోత్సహించాలని కోరారు. పట్టుదలతో చదివి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, గ్రామానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థినులకు సూచించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థుల కుటుంబ సభ్యులు ,గ్రామస్థులు, రజక విద్యార్థి విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలలే విద్యార్థుల భవిష్యత్తుకు దేవాలయాలు

## ● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి,పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు స్పష్టం చేశారు. బుధవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా మండల విద్యాశాఖ అధికారులు,సర్పంచులతో నిర్వహించిన ప్రత్యేక వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యను తీర్చిదిద్దేందుకు ప్రీ–ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు ఉచిత విద్యను అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. నియోజకవర్గంలోని ఎంపిక




చేసిన ప్రాథమికోన్నత పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలుగా అభివృద్ధి చేయనున్నట్లు, అలాగే జిల్లాలో రూ. 200 కోట్లతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ రెసిడెన్షియల్' పాఠశాల నిర్మాణం జరుగుతుందని వెల్లడించారు. వసతి గృహాల్లోని విద్యార్థుల కోసం కాస్మెటిక్ ఛార్జీలను 200 శాతం, డైట్ ఛార్జీలను 40 శాతం పెంచిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. సర్పంచులు తమ పరిధిలోని పాఠశాలలను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తూ విద్యాబోధన, మెనూ అమలును పర్యవేక్షించాలని, పాఠశాలల మీద నుండి వెళ్తున్న విద్యుత్ లైన్లను తొలగించేందుకు జాబితా అందజేయాలని సూచించారు. పాఠశాలల్లో లైబ్రరీలు ఏర్పాటు చేసి విద్యార్థులకు పఠనాశక్తిని పెంపొందించడమే కాకుండా, క్రీడా స్థలాలు, కాంపౌండ్ వాల్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు అందజేయాలని ఎమ్మెల్యే దిశానిర్దేశం



చేశారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం చేసే ఖర్చును భవిష్యత్తుకు పెట్టే పెట్టుబడిగా అభివర్ణించారు. ప్రజాపాలన




ప్రగతి ప్రణాళికలో భాగంగా వారం రోజుల పాటు విద్యా వారోత్సవాలను నిర్వహిస్తున్నామని, దీని ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన మరియు సుందరీకరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. పది, ఇంటర్ ఫలితాల్లో జిల్లా ఉత్తమ ప్రతిభ కనబరచడంపై హర్షం వ్యక్తం చేస్తూ, బడిబాట కార్యక్రమం ద్వారా విద్యార్థులను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అధికారులను కోరారు. ప్రతి పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దడంలో ప్రజాప్రతినిధులు మరియు అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఆర్‌ఓ వసంతకుమారి, గ్రంథాలయాల సంస్థ చైర్మన్ రాజబాబు, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, అన్నిమండలాల ఎంఈఓలు, సర్పంచులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జనగామలో టీ స్టాల్ తొలగింపును సమర్ధించిన కోర్టు

## జిల్లా యంత్రాంగ చర్యలకు హైకోర్టు మద్దతు

**తెలుగు గళం న్యూస్ జనగామ, మే 13**

జిల్లాలో టీ స్టాల్ తొలగింపు వ్యవహారంపై వచ్చిన వివాదాలకు ముగింపు పలుకుతూ తెలంగాణ హైకోర్టు జిల్లా యంత్రాంగ చర్యలను సమర్థించింది. డబ్ల్యుపి No.8348/2026 కేసులో విచారణ జరిపిన కోర్టు, సంబంధిత టీ స్టాల్ ప్రభుత్వ భూమిలోనే ఉన్నట్లు స్పష్టం చేస్తూ, భూమి కేటాయింపు ఉత్తర్వులు లేవని పేర్కొంది. ప్రభుత్వ భూమి ఆక్రమణకు అనుమతి లేదని కూడా తీర్పులో వెల్లడించింది.గతంలో ఉన్న తాత్కాలిక ఉత్తర్వును రద్దు చేసిన కోర్టు, వార్డు–17లోని వెజ్–నాన్ వెజ్ మార్కెట్ సమీపంలో ప్రత్యామ్నాయ స్థలాన్ని తాత్కాలిక లైసెన్సుతో కేటాయించాలని ఆదేశించింది. "వాస్తు పేరుతో తొలగింపు" అన్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని జిల్లా యంత్రాంగం స్పష్టం చేసింది. ఇక జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలో సర్వే & భూ రికార్డుల కార్యాలయంలో అనుమతి లేకుండా ముగ్గురు ప్రైవేట్ వ్యక్తులు అధికారిక ల్యాప్‌టాప్, ప్రింటర్ ఉపయోగించి భూ రికార్డుల ప్రింట్లు తీస్తున్న ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ విషయంపై సంబంధిత అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయగా,



OFFICE OF THE DISTRICT COLLECTOR & DISTRICT MAGISTRATE
JANGAON DISTRICT, TELANGANA STATE

PRESS NOTE

FOR IMMEDIATE RELEASE | Date: 13/05/2026

HIGH COURT VINDICATES DISTRICT ADMINISTRATION;
ENTRY/EXIT PROTOCOL BASED ON DOCUMENTED INCIDENTS

**Jangaon:** In response to news reports appearing on 13/05/2026, the District Administration places the following true facts on record.

On the tea stall removal: The Hon'ble High Court of Telangana, by order dated **10/04/2026 in WP No. 8348 of 2026** (Hon'ble Sri Justice B. Vijaysen Reddy), has independently vindicated the action of the District Administration. The Hon'ble Court has recorded that (i) the tea stall was on **Government Land in Survey No. 180**; (ii) the petitioners **"failed to produce any order of the land allotment"**; (iii) **"IMSS does NOT authorise occupation of Government land"**; (iv) the petitioners' own counsel *fairly submitted* before the Court that there was no claim of ownership; (v) the earlier interim order was **VACATED**; and (vi) an alternate site was directed and has since been allotted near the Veg-Non Veg Market, Ward 17, on a Temporary Revocable License. **The "Vastu pretext" allegation is baseless. The basis was the law, not Vastu. No person's livelihood has been extinguished** — the alternate site is operational.

On the entry/exit protocol: Two documented incidents form the basis.

*First — Sunday, 22/03/2026 at around 4:00 PM:* During a random inspection by the District Collector, the chamber of the **Assistant Director, Survey & Land Records** was found to have been opened on a holiday by an Office Subordinate (on the call of a Surveyor from another mandal), with **THREE PRIVATE PERSONS — having no official capacity whatsoever — inside the chamber**, taking **colour prints of Sub-Division Records of the Devadula Lift Irrigation Project** pertaining to villages in Palakurthy and Devarappula mandals, using the official laptop and colour printer, **without the knowledge or permission of the A.D., S&LR**. Show Cause Notice issued, RDO enquiry completed, disciplinary action under way, and criminal action against the private persons under examination.

*Second — Unauthorised vehicles:* A physical audit disclosed **approximately 80 unclaimed vehicles** (some unparked for years, including case-property seizures from various districts) lying within the Collectorate Complex — a fire and security hazard, and an unmonitored security perimeter. Disposal in progress with SP Jangaon and the RTA.


FACT CHECK:

- It is a fact, recorded by the Hon'ble High Court, that the tea stall was on Government land without any allotment order.
- It is a fact that an alternate site has been allotted in compliance with the Court's direction.
- It is a fact that confidential land records of a major State irrigation project were being copied by three private individuals on a Sunday, in the absence and without the knowledge of the records-custodian officer.
- It is a fact that approximately 80 unauthorised vehicles were occupying the Collectorate Complex.

The District Administration **welcomes legitimate criticism and bonafide journalistic scrutiny**, and respects every citizen's right to express grievances. What is asked in return is that criticism be **based on facts, not on fabrication**. The labelling of these documented administrative measures as "dictatorial" **is disproportionate to the facts on record**. The District Administration shall continue to discharge its duties — with the same firmness and constitutional propriety that the Hon'ble High Court has independently endorsed.

Sd/-
**District Public Relations Officer**
On the directions of the District Collector & District Magistrate, Jangaon.

విచారణ అనంతరం పరిపాలనా చర్యలు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. ప్రైవేట్ వ్యక్తులపై క్రిమినల్ చర్యల పరిశీలన కొనసాగుతోంది. అదేవిధంగా, కలెక్టరేట్ ప్రాంగణంలో సుమారు 80 క్లెయిమ్ చేయని వాహనాలు గుర్తించబడినట్లు వెల్లడించారు. అవి అగ్ని ప్రమాదం, భద్రతా సమస్యలకు కారణమయ్యే అవకాశం ఉన్నందున పోలీసు శాఖ, ఆర్టీఏ సహకారంతో తొలగింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు .జిల్లా యంత్రాంగం ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా పరిశీలనను స్వాగతిస్తుందని పేర్కొంటూ, విమర్శలు వాస్తవాల ఆధారంగా ఉండాలని సూచించింది. నమోదైన పాలనా చర్యలను "నిరంకుశం"గా అభివర్ణించడం వాస్తవాలకు విరుద్ధమని స్పష్టం చేసింది. హైకోర్టు ధృవీకరణతో రాజ్యాంగబద్ధంగా, పారదర్శకంగా విధులు నిర్వహించడం కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.



జిల్లా కలెక్టర్ & జిల్లా మాజిస్ట్రేట్ కార్యాలయం
జనగామ జిల్లా, తెలంగాణ రాష్ట్రం

ప్రెస్ నోట్

తక్షణ విడుదలకు | తేదీ: 13/05/2026

జిల్లా యంత్రాంగ చర్యలను హైకోర్టు ధృవీకరించింది;
ఎంట్రీ/ఎగ్జిట్ ప్రోటోకాల్ – నమోదైన సంఘటనల ఆధారంగా

**జనగామ:** 13/05/2026 నాటి వార్తాపత్రికలలో వచ్చిన వార్తల నేపథ్యంలో, జిల్లా యంత్రాంగం ఈ క్రింది వాస్తవాలను రికార్డుపై ఉంచుతోంది.

టీ స్టాల్ తొలగింపు విషయంలో: మాన్యమైన తెలంగాణ హైకోర్టు, మాన్య న్యాయమూర్తి శ్రీ బి. విజయసేన్ రెడ్డి గారు, 10/04/2026 తేదీన **WP నం. 8348/2026** లో జారీచేసిన ఉత్తర్వు ద్వారా జిల్లా యంత్రాంగ చర్యలను స్వతంత్రంగా ధృవీకరించారు. మాన్య న్యాయస్థానం నమోదు చేసింది: (i) టీ స్టాల్ **సర్వే నం. 180 లోని ప్రభుత్వ భూమిలో** ఉంది; (ii) పిటిషనర్లు **"భూమి కేటాయింపు ఉత్తర్వు ఏదీ ఉత్పత్తి చేయడంలో విఫలమయ్యారు"**; (iii) **"IMSS ప్రభుత్వ భూమి ఆక్రమణకు అనుమతి ఇవ్వదు"**; (iv) పిటిషనర్ల తరఫు న్యాయవాది యాజమాన్యం లేదని ఒప్పుకున్నారు; (v) గతంలో ఉన్న తాత్కాలిక ఉత్తర్వు **రద్దు** చేయబడింది; మరియు (vi) ప్రత్యామ్నాయ స్థలం కేటాయించమని ఆదేశించింది – వార్డు 17 లోని వెజ్-నాన్ వెజ్ మార్కెట్ సమీపంలో తాత్కాలిక ఉపసంహరణీయ లైసెన్సు పై కేటాయించబడింది. **"వాస్తు పేరుతో" అనే ఆరోపణ నిరాధారమైనది. ఆధారం వాస్తు కాదు, చట్టం. ఏ వ్యక్తి ఉపాధీ పోలేదు** – ప్రత్యామ్నాయ స్థలం పనిచేస్తోంది.

ఎంట్రీ/ఎగ్జిట్ ప్రోటోకాల్ విషయంలో: నమోదైన రెండు సంఘటనలు దీనికి ఆధారం.

***మొదటి – ఆదివారం, 22/03/2026 సాయంత్రం 4:00 గంటల సమయంలో:*** జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలో **అసిస్టెంట్ డైరెక్టర్, సర్వే & భూ రికార్డులు (A.D., S&LR)** చాంబర్ పనిదినమన ఉన్నప్పటికీ ఓపెన్ చేసినట్లు కనుగొనబడింది – మరొక మండలానికి చెందిన సర్వేయర్ పిలుపు మేరకు ఆఫీసు సబార్డినేట్ ద్వారా. లోపల **ముగ్గురు ప్రైవేటు వ్యక్తులు – ఏ అధికారిక హోదా లేనివారు – దేవదుల ఎత్తిపోతల ప్రాజెక్టు** కి చెందిన పాలకుర్తి మరియు దేవరుప్పుల మండలాల గ్రామాలకు సంబంధించిన **ఉప-విభజన రికార్డులను (SDRs) కలర్ ప్రింట్ లు తీస్తున్నారు** – అధికారిక లాప్టాప్ మరియు ప్రింటర్ ఉపయోగించి, **A.D., S&LR కు తెలియకుండా మరియు అనుమతి లేకుండా**. షో కాజ్ నోటీసు జారీ చేయబడింది; RDO విచారణ పూర్తి; పరిపాలనాపరమైన చర్యలు ప్రారంభమయ్యాయి; ప్రైవేటు వ్యక్తులపై క్రిమినల్ చర్య పరిశీలనలో ఉంది.

***రెండవది – అనధికార వాహనాలు:*** భౌతిక తనిఖీలో **సుమారు 80 క్లెయిమ్ చేయని వాహనాలు** (కొన్ని సంవత్సరాలుగా, వివిధ జిల్లాల నుండి కేసు ఆస్తి సీజర్లతో సహా) కలెక్టరేట్ ప్రాంగణంలో పడిఉన్నట్లు బయల్దేరపడింది – అగ్ని మరియు భద్రతా ప్రమాదం. SP జనగామ మరియు RTA సహకారంతో తొలగింపు ప్రక్రియ నడుస్తోంది.

వాస్తవ తనిఖీ:

- మాన్యమైన హైకోర్టు రికార్డుపై ఉంచిన వాస్తవం – టీ స్టాల్ ఏ విధమైన కేటాయింపు ఉత్తర్వు లేకుండా ప్రభుత్వ భూమిలో ఉంది.
- న్యాయస్థానం ఆదేశానుసారంగా ప్రత్యామ్నాయ స్థలం కేటాయించబడిందనేది ఒక వాస్తవం.
- ఒక ప్రధాన రాష్ట్ర నీటిపారుదల ప్రాజెక్టు కి సంబంధించిన రహస్య భూ రికార్డులను రికార్డుల అధికారి లేనిసమయంలో ఆతని అనుమతి లేకుండానే ముగ్గురు ప్రైవేటు వ్యక్తులు ఆదివారం నాడు కాపీ చేస్తున్న వాస్తవం.
- సుమారు 80 అనధికార వాహనాలు కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న వాస్తవం.

జిల్లా యంత్రాంగం **న్యాయబద్ధమైన విమర్శ ను మరియు నిజాయతీ ఉన్న పత్రికా పరిశీలనను స్వాగతిస్తుంది**, ప్రతి పౌరుడి మరియు ప్రతి రాజకీయ పార్టీ హక్కున్ను గౌరవిస్తుంది. తిరిగి కోరేది ఒక్కటే – **విమర్శ వాస్తవాల ఆధారంగా ఉండాలి, కల్పనల ఆధారంగా కాదు**. ఈ నమోదైన పాలనా చర్యలను "నిరంకుశం" అని పేర్కొనడం రికార్డుపై ఉన్న వాస్తవాలకు **అసమానమైనది**. మాన్యమైన హైకోర్టు స్వతంత్రంగా ఆమోదించిన దృఢతతో మరియు రాజ్యాంగపరమైన మర్యాదతో జిల్లా యంత్రాంగం తన విధులను నిర్వహించడం కొనసాగిస్తుంది.

Sd/-
**జిల్లా ప్రజా సంబంధాల అధికారి**
జిల్లా కలెక్టర్ & జిల్లా మాజిస్ట్రేట్, జనగామ ఆదేశాల మేరకు.

# నీట్ లీకేజీపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరపాలి

## కేంద్ర మంత్రి రాజీనామాకు బీకేఎంయూ డిమాండ్

**తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/మే 13:**


పర్వతగిరి:నీట్ పరీక్ష పేరుతో 23 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడడం దుర్మార్గమని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు తీవ్రంగా విమర్శించారు.

ఇది కేంద్ర ప్రభుత్వ వైఫల్యం ఒక ప్రకటన విడుదల చేసిన వెంకట్రాములు," ప్రశ్నాపత్రం లీకేజీ కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించి తక్షణమే రాజీనామా చేయాలి.ఎన్‌టీఏను రద్దు చేయాలి" అని డిమాండ్ చేశారు.సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

"ఈ సంఘటనపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ చేయించి దోషులను కఠినంగా శిక్షించాలి. గతంలో అనేకసార్లు లీకేజీలు జరిగినా గుణపాఠాలు తీసుకోకపోవడం వల్లే మళ్లీ జరుగుతున్నాయి"అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేద విద్యార్థులకు తీరని అన్యాయం

"ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగు బలహీన వర్గాలకు చెందిన రైతులు, కార్మికులు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా తమ పిల్లల భవిష్యత్తు కోసం అప్పులు చేసి కోచింగ్ సెంటర్లకు పంపిస్తే, పేపర్ లీకై పరీక్షలు రద్దు కావడం మానసిక వేదనకు గురిచేసింది"అని తెలిపారు.

మళ్లీ పరీక్షలు రాయడానికి తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడుతుందని, కేంద్ర ప్రభుత్వం ప్రతి విద్యార్థికి 25 వేల ఆర్థిక సహాయం అందించాలని వెంకట్రాములు డిమాండ్ చేశారు. ఆన్‌లైన్‌లో ఒకేసారి పరీక్ష నిర్వహించాలి భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, ప్రశ్నాపత్రాలు లీక్ కాకుండా నిపుణులు సూచించిన విధంగా ఆన్‌లైన్ విధానంలో ఒకేసారి పరీక్ష నిర్వహించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.



# మైనర్ బాలికపై దాడి కేసులో సాయి భగీరథ్‌ను అరెస్టు చేయాలి

## బీఆర్ అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం డిమాండ్

**ఖమ్మం, మే13 (తెలుగుగళం) న్యూస్ :** మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి సాయి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మంలో విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. బాధిత కుటుంబ సభ్యులపై హనీ ట్రాప్ పేరుతో తప్పుడు కేసులు నమోదు చేయడం దుర్మార్గమన్నారు. కేసును నిష్పక్షపాతంగా విచారించి బాధిత బాలికకు న్యాయం చేయాలని ప్రభుత్వాలను కోరారు.

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తన కుమారుడు సాయి భగీరథ్‌ను పోలీసులకు అప్పగించి విచారణకు సహకరించాలని సూచించారు. బాధిత కుటుంబానికి రక్షణ కల్పించడంతో పాటు నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.



# తాలు, తరుగు పేరుతో రైతులను దోపిడీ చేస్తే ఉపేక్షించం

## ● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి

ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో తాలు, తరుగు పేరుతో అన్నదాతలను దోపిడీ చేస్తే ఎంతటి వారినైనా సహించేది లేదని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మిల్లర్లను తీవ్రంగా హెచ్చరించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, రైస్ మిల్లర్లతో ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో కాంటా పూర్తయిన వెంటనే రైతులకు ట్రక్ షీట్లు ఇవ్వకుండా జాప్యం చేయడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంటా వేసిన తర్వాత ధాన్యం బాధ్యత కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలు మరియు మిల్లర్లదేనని, రైతుకు దానితో ఎటువంటి సంబంధం ఉండకూడదని స్పష్టం చేశారు. సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు క్షేత్రస్థాయిలో అమలు కాకపోవడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేస్తూ, విధి నిర్వహణలో వైఫల్యం చెందుతున్న అధికారులదే బాధ్యతని తేల్చి చెప్పారు. అకాల వర్షాల వల్ల రైతులు ఇప్పటికే నష్టపోయారని, వారిని మరింత ఇబ్బందులకు గురిచేస్తే ప్రభుత్వం పట్ల చెడ్డపేరు వస్తుందని, అటువంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని మిల్లర్లకు ఖచ్చితమైన వార్నింగ్ ఇచ్చారు.





అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. రవాణా సౌకర్యాల్లో ఆటంకాలు కల్పిస్తే సంబంధిత ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. ధాన్యం కొనుగోలు జరిగిన వెంటనే 48 గంటల్లో రైతులకు నగదు జమ అయ్యేలా ఓపీఎంఎస్ లో వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. రైస్ మిల్లుల వద్ద ధాన్యం దిగుమతి ప్రక్రియను పర్యవేక్షించడానికి ప్రతి మిల్లుకు ఒక ప్రత్యేక అధికారిని నియమించినట్లు వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల నుండి ప్రతిరోజూ తనకు సమగ్ర నివేదిక అందజేయాలని కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డీఆర్ఓ వసంతకుమారి, పౌరసరఫరాల శాఖ అధికారి కిరణ్ కుమార్, డీఎం రాములు, వ్యవసాయ అధికారి బాబూరావు, మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, రవాణా శాఖ అధికారి మహమ్మద్ సంధాని, డీఆర్‌డీఓ బాలకృష్ణ, సహకార అధికారి వాలియా నాయక్, డీపీఓ శ్రీలత తదితరులు పాల్గొన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే, కలెక్టర్ సంయుక్తంగా ఆదేశించారు.

# ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి అయ్యేవరకు అధికారులు క్షేత్రస్థాయిలోనే ఉండాలి

- ప్రతి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, పర్యవేక్షించాలి
- కొనుగోలు, రవాణాలో ఎలాంటి సమస్య లేకుండా చూడాలి
- ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



తెలుగు గళం న్యూస్ జనగామ మే13

జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాలలో జరుగుతోన్న ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం, రవాణా, గన్నీ బ్యాగుల సరఫరా, హమాలీల ఏర్పాటు వంటి అంశాల్లో నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా వెంటనే అన్‌లోడింగ్, మిల్లులకు తరలింపు చర్యలు చేపట్టాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ప్రతిరోజు అధికారులు పది కొనుగోలు కేంద్రాలను తప్పకుండా సందర్శించి, ధాన్యం కొనుగోలు ప్రక్రియ సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. మిల్లులకు ధాన్యాన్ని తరలించేందుకు సరిపడా లారీలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఎఫ్ఏక్యూ ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని, రైతులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. సీసీలు తప్పనిసరిగా కేటాయించిన కొనుగోలు కేంద్రాల్లోనే ఉండాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి ఎప్పటికప్పుడు

ఓపీఎంఎస్ నమోదును చేయాలన్నారు. రైతులకు రశీదులు వెంటనే అందేలా ఓపీఎంఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో పౌరసరఫరాల సంస్థ డీఎం హతిరామ్, జిల్లా మార్కెటింగ్ అధికారి రామకృష్ణ, ఇంచార్జి డీసీఎస్ఓ సురేష్ రెడ్డి, డీఆర్డీవో భాస్కర్, ఏపీడీ నూరుద్దీన్, రవాణా, వ్యవసాయ శాఖ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# ధాన్యం కొనుగోళ్లలో జాప్యానికి తావులేకుండా చర్యలు చేపట్టాలి

- రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలి
- ధాన్యం దిగుమతి, రవాణా వేగవంతం చేయాలి
- కొనుగోలు కేంద్రాల ఆకస్మిక తనిఖీ
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

తెలుగు గళం న్యూస్ జనగామ మే13





జిల్లాలోని లింగాల ఘనపురం మండలంలోని కుందారం, దేవరుప్పుల మండలంలోని కోలుకొండ, పాలకుర్తి మండలంలోని ఈరవెన్ను, అయ్యంగారిపల్లి, గూడూరు, ఘనపూర్ (స్టేషన్) మండలంలోని శివునిపల్లి గ్రామాల పరిధిలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా క్షేత్రస్థాయిలో సందర్శించి, ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించి, కొనుగోళ్లకు సంబంధించిన రిజిస్టర్లను, ఇప్పటివరకు కేంద్రాలకు వచ్చిన ధాన్యం, అందులో ఎంత కొనుగోలు చేశారు? ఎంత మిల్లులకు తరలించారు? లారీల గురించి కలెక్టర్ కేంద్ర నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని ఎలాంటి ఆలస్యం లేకుండా వెంటనే కొనుగోలు చేసి అన్‌లోడింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ధాన్యం తూకం, నాణ్యత పరిశీలన పారదర్శకంగా నిర్వహించాలని, కొనుగోలు అనంతరం వెంటనే రశీదులు అందజేయాలని తెలిపారు. కేంద్రాల్లో తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను సక్రమంగా పరిశీలిస్తూ రైతులకు స్పష్టమైన సమాచారం ఇవ్వాలని అన్నారు. అదే విధంగా ధాన్యం నిల్వ, రవాణా ప్రక్రియలను వేగవంతం చేసి ఎక్కడా నిల్వలు పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు. ధాన్యం బస్తాల దిగుమతిలో మిల్లుల వద్ద ఒకరు తప్పకుండా బాధ్యత వహించి, త్వరితగతిన దిగుమతి అయ్యేలా చూడాలన్నారు. కొనుగోళ్లకు సంబంధించిన ప్రతి రిజిస్టర్, ట్రక్ షీట్ పక్కాగా నిర్వహించాలని తెలిపారు. సరిపడా హమాలీలను సమాకుర్చుకోవాలని, లారీలు త్వరగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు అయిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ఓపీఎంఎస్ లో నమోదు చేయాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున రైతులు, కేంద్రం నిర్వాహకులు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అలాగే ఏపీఎంలు, సీసీలు, కేంద్ర నిర్వాహకులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. రైతులు గంటల తరబడి వేచి ఉండకుండా ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేసి కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి నిర్లక్ష్యం, ఆలస్యం చోటు చేసుకున్నా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాణ్యత పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వం రైతులకు మద్దతుగా నిలుస్తోందని, ప్రతి గింజను కొనుగోలు చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.





# అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన స్వప్నిక రేహా ఫౌండేషన్




హైదరాబాద్, లక్డీకాపూల్: అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని లక్డీకాపూల్‌లోని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో స్వప్నిక రేహా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 50 మందికి పైగా నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ వేడుకలో స్వప్నిక రేహా ఫౌండేషన్ సభ్యులు మహాలక్ష్మి , వరదాచార్య, హరికృష్ణ, నరేష్ , శ్రీ రాగ తనిష్క, కావ్య, బెల్లాల రాఘవేంద్రతో పాటు కూచిపూడి బృందానికి చెందిన రజినిమాయి, వెస్టర్న్ డాన్స్ కొరియోగ్రాఫర్ సతీష్, మహిపాల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి విభాగాధిపతి డాక్టర్ రఘునందన్, డాక్టర్ విశాల్, ఆర్ఎంఓ డాక్టర్ శ్రీకుమార్, డాక్టర్ స్పందన, నర్సింగ్ విభాగాధిపతులు పుష్ప, మేరీ తదితరులు నర్సింగ్ సేవల ప్రాముఖ్యతను వివరించారు. సమాజానికి నర్సులు అందిస్తున్న సేవలు అమూల్యమని పేర్కొంటూ అంతర్జాతీయ నర్సుల దినోత్సవం యొక్క విశిష్టతను తెలియజేశారు.

ఈ సందర్భంగా వరదాచార్య గారు ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రికి రూ.10,000 విరాళంగా అందజేశారు. అనంతరం నర్సింగ్ సిబ్బంది ఒక్కొక్కరు తమ పరిచయాలను తెలియజేస్తూ నర్సింగ్ వృత్తిలోకి రావడానికి ప్రేరణనిచ్చిన వ్యక్తులు, రోగులతో గడిపిన భావోద్వేగ క్షణాలను పంచుకున్నారు.

తరువాత స్వప్నిక రేహా ఫౌండేషన్ మరియు ముఖ్య అతిథులను సన్మానించింది. అనంతరం నర్సింగ్ సిబ్బందికి, అలాగే ఆసుపత్రిలో క్యాన్సర్ చికిత్స పొందుతున్న చిన్నారులకు స్టీల్ వాటర్ బాటిళ్లను బహుమతులుగా పంపిణీ చేశారు.

ఇంకా చిన్నారులతో ప్రత్యేకంగా సమయం గడిపిన స్వప్నిక రేహా బృందం పలు ఆటలు, పోటీలు నిర్వహించి, స్టీలు బాక్స్ లు, డ్రాయింగ్ కిట్ లు అందించి వారిని ఉత్సాహపరిచింది. నృత్యాంజలి అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, పాటలు, నృత్యాలతో పిల్లలు, తల్లిదండ్రులు, ఆసుపత్రి సిబ్బందిని అలరించారు. అనంతరం పిల్లలకు బహుమతులు మరియు పౌష్టికాహార పదార్థాలను అందజేశారు.

ఈ సందర్భంగా క్యాన్సర్ వ్యాధితో మృతి చెందిన రోగుల ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ అందరూ కలిసి రెండు నిమిషాల మౌనం పాటించారు. ఆ దృశ్యం అక్కడున్న వారిని భావోద్వేగానికి గురిచేసింది.

ఈ కార్యక్రమం సేవా భావాన్ని చాటుతూ నర్సింగ్ సిబ్బందికి ప్రోత్సాహాన్ని అందించడంతో పాటు చిన్నారుల్లో ఆనందాన్ని నింపిందని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.

# రాపూరు నూతన ఎస్ఐ ని కలసిన టిడిపి నేతలు

నెల్లూరు జిల్లా రాపూరు –రాపూరు నూతన సబ్ ఇన్‌స్పెక్టర్ ని బుధవారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పచ్చిగల్ల రత్నయ్య మరియు నెల్లూరు జిల్లా సెంట్రల్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ బత్తిన శ్రీహరి రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎస్ఐ చొరవ చూపాలని కోరారు. పోలీసు యంత్రాంగానికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.




# రాజమహేంద్రవరం : వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు బెయిల్ రద్దు..!



డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో, అనంతబాబుకు గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన బెయిల్ రద్దు చేస్తూ రాజమహేంద్రవరం ప్రత్యేక న్యాయస్థానం ఆదేశాలు జారిచేసింది. డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో సాక్షులను ప్రలోభపెట్టిన కేసులో అనంతబాబును ఏప్రిల్ 24న కాకినాడ సర్పవరం పోలీసులు అరెస్టు చేశారు. సాక్షులను బెదిరించినట్లు ఆధారాలతో సహా నిర్ధారణ అవడంతో, అనంతబాబుకు న్యాయస్థానం బెయిల్ రద్దు చేసింది.

## ర్యాలీ గ్రామంలో ప్రీమియర్ లీగ్-2 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు..


### రాష్ట్రవ్యాప్తంగా 70 టీమ్స్ ఈ టోర్నమెంట్లో

ఆత్రేయపురం ఆత్రేయపురం మండల ర్యాలీ గ్రామంలో నిర్వహిస్తున్న ర్యాలీ ప్రీమియర్ లీగ్–2 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలను కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా బండారు శ్రీనివాస్ మాట్లాడుతూ దాదాపు రాష్ట్రవ్యాప్తంగా 70 టీమ్స్ ఈ టోర్నమెంట్లో పాల్గొనడం అభినందనీయం అన్నారు, యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, గెలుపు ఓటములు పక్కన పెట్టి క్రీడా స్ఫూర్తితో, స్నేహభావంతో ఆడాలని, ప్రతి ఆటగాడు తమ ప్రతిభను కనబర్చేలా ఆడాలని కోరుకుంటున్నట్లు తెలియజేశారు. అనంతరం మొదటి మ్యాచ్కు సంబంధించి కొమరాజులంక, లక్ష్మీ పోలవరం గ్రామాల జట్లకు తాస్ వేసి లీగ్ ను ప్రారంభించారు. ఈ ప్రీమియర్ లీగ్ ను నిర్వహిస్తున్న వారిని, స్పాన్సర్లను అభినందించారు.

# సినిమా న్యూస్

## మళ్లీ వచ్చిన IBOMMA

### కొత్త సినిమాలతో ఇంటర్నెట్‌లో ప్రత్యక్షం




కొద్ది నెలల క్రితం వరకు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా IBOMMA చర్చనీయాంశంగా మారింది. ఈ యాప్ నిర్వహకుడు రవిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి అతనితోనే యాప్ ను తొలగించారు. నాటి నుంచి ఇంటర్నెట్ లో IBOMMA వెబ్ సైట్ కనిపించకుండా పోయింది. అయితే బెయిల్ పై జైలు నుంచి రవి విడుదలైన కొద్ది రోజులకే.. మరోసారి ఇంటర్నెట్ IBOMMA వెబ్ సైట్ ప్రత్యక్షమైంది. Bappam పేరుతో ఉన్న లింకుపై క్లిక్ చేసిన వెంటనే నేరుగా ఐ బొమ్మ ఓపెన్ అవుతుంది. అందులో 2026 సంవత్సరానికి సంబంధించిన అన్ని కొత్త సినిమాలు కనిపించడంతో అంతా ఆశ్చర్యానికి గురవుతున్నారు. దీంతో మరోసారి సినిమా నిర్మాతల్లో ఆందోళన మొదలైంది. గతంలో చిన్న, పెద్ద సినిమా అనే తేడా లేకుండా రిలీజైన 24 గంటల్లోపే ఈ సైట్ లో పైరసీ, HD ప్రింట్ లతో సినిమాలు రావడం నిర్మాతలను కలవరపెట్టిన విషయం తెలిసిందే.




## వివాదంలో నటుడు అలీ వారికి క్షమాపణలు

టాలీవుడ్ సీనియర్ నటుడు, కమెడియన్ అలీ మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. ఓ సబ్బుకు సంబంధించిన యాడ్ లో హిందువుల మనోభావాలు దెబ్బతిశాడని తీవ్ర ఆరోపణలు వచ్చాయి. దీంతో హిందూ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. వివరాల్లోకి వెళితే.. ఇటీవల సోషల్ మీడియాలో ఫేమస్ అయిన ఘర్ సోఫ్ .. యాడ్ లో నటుడు అలీ పాల్గొన్నారు. అందులో సబ్బు కి లక్ష్మీ పూజ చేయడం కనిపించింది. బ్యాక్‌గ్రౌండ్‌లో లక్ష్మీదేవి మంత్రాలు వినిపించాయి. దీంతో హిందూ సంఘాలు తీవ్ర అభ్యంతరం చేస్తూ.. అలీని బాయ్‌కాట్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. వివాదం ముదరడంతో క్షమాపణ చెప్పిన అలీ గతంలో చేసిన ఓ సినిమాలోని సన్నివేశం ఆధారంగా యాడ్ రూపొందించారని వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు.



## ఎన్టీఆర్ ఫ్యాన్స్ కు గుడ్ న్యూస్

జూనియర్ ఎన్టీఆర్ వరుస సినిమాలతో దూసుకు వెళ్తున్నారు. ఆర్ఆర్ఆర్ సినిమాతో పాన్ ఇండియా స్టార్ హీరోగా మారిపోయిన జూనియర్ ఎన్టీఆర్, ప్రస్తుతం మూడు సినిమాలు లైన్ లో పెట్టారు. అయితే ఈ మూడు సినిమాల నుంచి ఒకే రోజున అప్డేట్స్ ఇచ్చేందుకు ఆయా చిత్ర బృందాలు సిద్ధమవుతున్నట్లు ఇండస్ట్రీలో టాక్ నడుస్తోంది. జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు మార్చి 20వ తేదీన అన్న సంగతి తెలిసిందే.

ఆ రోజున ప్రశాంత్ నీల్–ఎన్టీఆర్ కాంబినేషన్ లో వస్తున్న డ్రాగన్ మూవీ గ్లింప్స్ వదలనున్నారు. 19వ తేదీ అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఈ అప్డేట్ రానున్నట్లు టాక్. అటు గాడ్ ఆఫ్ వార్ సినిమాపై అనౌన్స్ మెంట్ రాబోతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాను త్రివిక్రమ్ చేస్తున్నారు. అటు దేవర 2 సినిమాకు సంబంధించిన పోస్టర్ మే 2వ తేదీన రిలీజ్ చేసేందుకు కొరటాల శివ కూడా రెడీ అయినట్లు టాక్ నడుస్తోంది. అంటే ఒకే రోజున మూడు అప్డేట్లు రాబోతున్నాయన్నమాట. ఈ విషయం తెలిసిన ఎన్టీఆర్ ఫ్యాన్స్ సంబరాలు చేసుకుంటున్నారు.

## ‘జైలర్ 2’ ఇప్పట్లో రానట్టేనా?

రజనీకాంత్ – నెల్సన్ దిలీప్ కుమార్ కాంబినేషన్‌లో వస్తున్న యాక్షన్ మూవీ ‘జైలర్ 2’. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమాను సెప్టెంబర్ 4వ తేదీకి వాయిదా వేసే ఆలోచనలో చిత్రబృందం ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి మేకర్స్ నుంచి ఇంకా అధికారిక ప్రకటన రానప్పటికీ, ఫిల్మ్ నగర్లో ఈ చర్చ జోరుగా సాగుతోంది. ఎందుకంటే ఇప్పటి వరకు షూట్ చేసిన కొన్ని సీన్లు ఆశించిన స్థాయిలో రాలేదని చిత్రబృందం భావిస్తోందట. దీంతో ఎడిటింగ్ టేబుల్ వద్దే కొన్ని మార్పులు చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.

దీనికి ఇంకా దాదాపు నెల రోజుల పాటు చిత్రీకరణ ఇంకా బ్యాలెన్స్ ఉన్నట్లు తెలుస్తోంది. అంతే కాదు ఇతర నటీనటుల క్యామియో రోల్స్‌కు సంబంధించిన డేట్స్, స్క్రీన్‌ప్లే సర్దుబాట్ల వల్ల కొంత గందరగోళం ఏర్పడిందని, అందుకే ఇంత ఆలస్యం జరుగుతోందని ఇండస్ట్రీ టాక్. ఇక పార్ట్ వన్ బ్లాక్ బస్టర్ హిట్ కావడంతో, సీక్వెల్ విషయంలో ఎక్కడా తగ్గకూడదని నిర్మాతలు భావిస్తున్నారు. అందుకే నాణ్యత కోసం ఎంత సమయమైనా తీసుకోవాలని టీమ్ ఫిక్స్ అయ్యింది. ప్రస్తుతానికి అభిమానులు ఈ వార్త విని కొంత నిరాశ చెందుతున్నా, రజనీకాంత్‌ను మరోసారి పవర్‌ఫుల్ యాక్షన్ రోల్‌లో చూడటానికి మాత్రం సిద్ధంగా ఉన్నారు. త్వరలోనే కొత్త రిలీజ్ డేట్‌పై ఒక క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.



## ‘మండాడి’ రిలీజ్ డేట్ ఫిక్స్




కోలీవుడ్ విలక్షణ నటుడు సూరి, టాలీవుడ్ వెర్సటైల్ హీరో సుహాస్ కలయికలో రాబోతున్న క్రేజీ మల్టీస్టారర్ ‘మండాడి’. మతిమారన్ పుగళేంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ చిత్రం మత్స్యకారుల జీవితాల నేపథ్యంలో సాగే ఒక ఇంటెన్స్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. నటుడు సూరి ఇప్పటికే ‘విడుతలై’ వంటి చిత్రాలతో తన నటనా విశ్వరూపాన్ని చూపించగా, తెలుగులో విభిన్నమైన పాత్రలతో ఆకట్టుకుంటున్న సుహాస్ ఈ చిత్రంలో ఒక కీలక పాత్ర పోషించడం విశేషం. వీరిద్దరి కలయిక సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఈ సినిమాలో మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సీనియర్ నటుడు సత్యరాజ్, రవీంద్ర విజయ్ వంటి హేమాహేమీలు ముఖ్య పాత్రల్లో కనిపించబోతున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతం అందిస్తున్నారు. ఎల్రెడ్ కుమార్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ పనులు చివరి దశకు చేరుకున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమాను ఆగస్ట్ 13న థియేటర్లలోకి తీసుకురావాలని చిత్రబృందం ప్లాన్ చేస్తున్నట్లు టాక్.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.